నేటి కందం-నేటికి అందం

మైకము నిదుననుచు యువత
పైకమును వృథాయొనర్చు వ్యసన మటంచున్
సైకిలు ర్యాలీ తీసెను
గైకొన బోననుచు మాదకద్రవ్యములన్ !!

(మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా హైదరాబాద్ తో సహా దేశంలోని పలు ప్రాంతాల్లో ప్రదర్శనలు జరిగాయి. దీనివలన యువతకు తద్వారా దేశానికి మేలు జరుగుతుందని అందరూ భావిస్తున్నారు.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

రాజకీయమై పోయే
రాబందుల వ్యాపారం
పతనమై రాలిపోయే
ప్రజాసేవ మమకారం.
ఏ పార్టీలో చూసినా
ఏమున్నది గొప్పతనం
అన్నిట్లో భూదందలు
అవినీతి లొల్లి ఘనం.

చురక

-వేల్పుల నారాయణ
9440433475



website:www.netinijam.com  ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433  E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 22-9-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:44 పేజీలు:6 వెల: రూ.1/-


# కేరళలో భారీ వర్షం బీభత్సం.. ఐదుగురు మృతి.. ఇద్దరు గల్లంతు



న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 21:కేరళను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు, కొండచరియలు విరిగిపడటం కారణంగా ఐదుగురు మరణించారు. ఇద్దరు గాయపడ్డారు. వర్షాలు, వరదలు వంటి విపత్తులపై కేరళ సీఎం వీడీ సతీషన్ స్పందించారు. వెంటనే సహాయక, సంరక్షణ చర్యలు చేపట్టాలని, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. ఆదివారం అధికారులకు ఈ అంశంపై ఆదేశాలు జారీ చేశారు. ఇడుక్కి, కొట్టాయం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి.

దీంతో కొన్నిచోట్ల ఆకస్మిక వరదలు సంభిస్తున్నాయి. కొండ చరియలు విరిగిపడటం, బురద పేరుకుపోవడం వంటివి జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కేరళ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ కమిషనర్ విగ్నేశ్వరి.. ఆయా జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. దీంతో కలెక్టర్లు, ఇతర అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. స్థానిక ప్రజలకు వాతావరణ పరిస్థితులపై ఎప్పటికప్పుడు మెసేజ్‌లతో అలర్ట్ చేస్తున్నారు. వరద ప్రభావానికి గురయ్యే అవకాశం ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. మలప్పురం జిల్లాలోని కొట్టావుల నదిలో నిలాంబుర్-అమరాంబలం ప్రాంతంలో ఐదుగురు నదిలో కొట్టుకుపోయారు.

నదిలో నీటి ఉధృతి ఉన్నట్లుండి పెరగడంతో వరదల్లో వీరు కొట్టుకుపోయారు. వీరిలో ఇద్దరు మరణించారు. ఒక వ్యక్తిని స్థానికులు రక్షించారు. మిగతావారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఇద్దరి మృతదేహాల్ని వెలికితీసినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. ఈ ఘటన గురించి సమాచారం అందుకున్న సీఎం.. సహాయక చర్యలు చేపట్టాల్సిందిగా ఆదేశించారు. మరోవైపు తమిళనాడులో కూడా భారీ వర్షాలు కురుస్తున్నాయి. కొట్టాయం జిల్లాలో కొండ చరియలు విరిగిపడటంతో ఒక మహిళ మరణించింది.

# మన అలవాట్లే మన ఎదుగుదలను నిర్ణయిస్తాయి

– లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, వ్యక్తిత్వ వికాస నిపుణులు




హైదరాబాద్, సెప్టెంబర్ 21: మన ఎదుగుదలను నిర్ణయించే ప్రధాన అంశాల్లో క్రమశిక్షణ కలిగిన దినచర్య, మనం ప్రదర్శించే మంచి అలవాట్లు మాత్రమే ఉంటాయని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, కవి, రచయిత, విశ్రాంత ప్రిన్సిపాల్ లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ అన్నారు అన్నారు. ఈ రోజు శాతవాహన లయన్స్ క్లబ్ నేతృత్వంలో జూబ్లీ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీలిద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉంటున్నదని అన్నారు. మన జీవనశైలిలో రోజుకు 3 – 4 ఇంట్లో చదువుకోవడానికి కేటాయించడం, పాఠశాలలో ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను మనసు పెట్టి విని ఆకలింపు చేసుకోవడం, ప్రతి రోజు ఒక గంట మైదాన క్రీడలకు కేటాయించడం జరగాలని సూచించారు. పేదరికాన్ని నిర్మూలించే ఏకైక ఉత్తమ సాధనం విద్య మాత్రమే అని చెప్పారు. లయన్ మర్రిపల్లి మహేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లయన్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్, లయన్ ఇనుగుర్తి రమేష్, లయన్ దాసరి తిరుపతి రెడ్డిలు మాట్లాడి కౌమార దశలో ఉన్న విద్యార్థులకు దిశ నిర్దేశం చేశారు. సీనియర్ లయన్ కోమల్ల రాజేందర్ రెడ్డి, లయన్ నార్ల వేణుగోపాల్ పాల్గొన్నారు. అనంతరం క్లబ్ సభ్యులు పదవి విరమణ పొందుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జలజా రాణిని సన్మానించారు. పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ముఖ్య అతిథి లయన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డిని సముచితంగా సత్కరించారు.

# ఢిల్లీ సెషన్స్ కోర్టులో సోనియా గాంధీకి చుక్కెదురు

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 21:ఢిల్లీ సెషన్స్ కోర్టులో సోనియా గాంధీకి చుక్కెదురైంది. ఆమె ఓటరు నమోదు వివాదంలో ఢిల్లీ సెషన్స్ కోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది.

ఇంటర్నెట్ డెస్క్: ఢిల్లీ సెషన్స్ కోర్టులో సోనియా గాంధీకి చుక్కెదురైంది. ఆమె ఓటరు నమోదు వివాదంలో ఢిల్లీ సెషన్స్ కోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. పౌరసత్వానికి ముందే ఓటరు జాబితాలో ఆమె పేరు ఉందన్న ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ తిరస్కరణ ఉత్తర్వులను రద్దు చేసింది.

# హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద ఉద్రిక్తత.. నిమజ్జనానికి అనుమతి ఇవ్వాలంటూ నిరసన..

హైదరాబాద్, సెప్టెంబర్ 21: నగరంలోని ట్యాంక్ బండ్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ట్యాంక్ బండ్‌పై గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి అనుమతి ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు ఆందోళనకు దిగారు. నిమజ్జనంపై ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ట్యాంక్ బండ్ వద్ద బైఠాయించారు. నిరసనలో భాగంగా అక్కడ చుట్టూ ఏర్పాటు చేసిన బారికేడ్లను ఉత్సవ సమితి ప్రతినిధులు తొలగించారు. వారిని పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో పలువురు పోలీసులు కిందపడిపోయారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

ఈ సందర్భంగా ట్యాంక్ బండ్‌పై గణేశ్ నిమజ్జనానికి అనుమతి ఇవ్వాల్సిందేనని భాగ్యనగర్ ఉత్సవ సమితి ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. బారికేడ్లను తొలగించిన అనంతరం వారు అక్కడే బైఠాయించి నిరసన కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమై ట్యాంక్ బండ్ పరిసరాల్లో భారీగా మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భద్రతను కట్టుదిట్టం చేశారు. కాగా, గణేశ్ నిమజ్జనం వేళ ట్యాంక్ బండ్ వద్ద ఆంక్షలపై ఉత్సవ సమితి అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. నిమజ్జన కార్యక్రమానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినప్పటికీ, ట్యాంక్ బండ్ వద్ద సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ట్యాంక్ బండ్ వద్ద నిరసనకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

# హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనాన్ని నిషేధించడం దారుణం: బండి సంజయ్

హైదరాబాద్, సెప్టెంబర్ 21: హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై నిమజ్జనాన్ని నిషేధించడం దారుణమని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ (ఃజీనిటతి ాజీనితీజీఎ ఐబీఎజీతీ) పేర్కొన్నారు. భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధుల అరెస్ట్ దుర్మార్గమని రాష్ట్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఈరోజు (సోమవారం) హైదరాబాద్‌లో మీడియాతో బండి సంజయ్ మాట్లాడారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులను అరెస్ట్ చేయడం సరికాదని అన్నారు.

ప్రతి ఏడాది ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని బండి సంజయ్ తెలిపారు. ఈసారి కూడా ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనానికి అనుమతించాల్సిందేనని స్పష్టం చేశారు. భాగ్యనగర్ ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి శశిధర్‌తో పాటు అరెస్ట్ చేసిన వారందరినీ బేషరతుగా విడుదల చేయాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# పార్టీ మీటింగులకు పిలువడం లేదని వ్యక్తిపై దాడి.. నలుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు



ములుగు, సెప్టెంబర్ 21:(నేటినిజం ప్రతినిధి): హనుమకొండ జిల్లా వేలేరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి పై ఇటివల జరిగిన దాడిలో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ తరలిస్తున్నట్లు ధర్మసాగర్ సీఐ అనుముల శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ధర్మసాగర్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..వేలేరు మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎండీ సద్దాం హుస్సేన్ అనే వ్యక్తి తనపై రౌడీషీట్ ఉన్నందున మండల పార్టీ అధ్యక్షుడు మురావత్ లక్ష్మణ్ నాయక్ తనను పార్టీ మీటింగ్ లకు సమాచారం ఇవ్వడంలేదని నెపంతో మండల పార్టీ అధ్యక్షుడు పై కక్ష్య పెంచుకున్నారు.

కాగా వేలేరుకు చెందిన మరో ముగ్గురు అనిల్, హరీష్, కృపసాగర్ అనే ముగ్గురితో కలిసి లక్ష్మణ్ నాయక్ పై హత్యాయత్నానికి ప్రణాళిక రూపొందించారు. ఈనెల 17 న లక్ష్మణ్ నాయక్ బైక్ పై హనుమకొండకు వెళ్లి వస్తుండగా ధర్మసాగర్ మండల సాయిపేట, కేషవనగర్ శివారులో హరీష్, కృపసాగర్ అనే ఇద్దరు బైక్ పై ముసుగు ధరించి లక్ష్మణ్ నాయక్ ను ఇనుప రాడ్డుతో దాడి చేసి పారిపోయారు. బాధితుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ధర్మసాగర్ పోలీసులు దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. కాగా కేసు దర్యాప్తులో వేలేరు ఎస్ఐ అజ్మీర సురేష్ చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించారని సీఐ శ్రీనివాస్ అభినందించారు.

# యూనైటెడ్ రష్యా పార్టీ ఘన విజయం

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 21: దిగువ సభకు (స్టేట్ డుమా) జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడు పుతిన్ అనుకూల యునైటెడ్ రష్యా పార్టీ ఘన విజయం సాధించింది. చెప్పుకోదగిన ప్రతిపక్ష పార్టీలు లేకపోవడంతో పుతిన్ పార్టీ విజయం నల్లేరుమీద నడకలా మారింది. ఉక్రెయిన్ యుద్ధం మొదలయ్యాక రష్యాలో ఎన్నికలు జరగడం ఇదే తొలిసారి.

రష్యా దిగువ సభలో మొత్తం 450 సీట్లు ఉంటాయి. వీటిలోని సగం సీట్లల్లో పార్టీలు అభ్యర్థులను పోటీలోకి దింపుతాయి. మిగిలిన సగం సీట్లలో (పార్టీ లిస్టు) ప్రజలు నేరుగా పార్టీలనే ఎంచుకుంటారు. పార్టీలకు వచ్చిన ఓట్ల ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుంది. 5 శాతానికి దిగువ ఓట్లు సాధించిన పార్టీలకు ఎలాంటి సీట్ల కేటాయింపు ఉండదు.

రష్యా మీడియా కథనాల ప్రకారం, ఇప్పటివరకూ 90 శాతం ఓట్ల కౌంటింగ్ పూర్తైంది. మొత్తం సీట్లలో యునైటెడ్ రష్యా పార్టీకి 355 సీట్లు లభించగా కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ రష్యాకు 40 సీట్లు లభించాయి. లిబరల్ డెమోక్రటిక్ పార్టీకి 25 సీట్లు, న్యూపీపుల్ పార్టీకి 20 సీట్లు దక్కాయి. ఈ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ప్రజల మద్దతు పుతిన్‌కు దక్కిందని అధికార పార్టీ ఘనంగా ప్రకటించింది.

# అంతరిక్ష రంగంలో చైనా దూకుడు.. 45 గంటల్లో నాలుగు రాకెట్ ప్రయోగాలు..!

హైదరాబాద్, సెప్టెంబర్ 21: అంతరిక్ష రంగం లో చైనా దూకుడు పెంచుతోంది. కేవలం 45 గంటల వ్యవధిలో నాలుగు రాకెట్ల ను విజయవంతంగా ప్రయోగించింది. మూడు వేర్వేరు ప్రయోగ కేంద్రాల నుంచి ఈ ప్రయోగాలు జరిగాయి. సెప్టెంబర్ 15, 16 తేదీల్లో చేపట్టిన ఈ ప్రయోగాల్లో ప్రభుత్వ సంస్థలతో పాటు ప్రైవేటు కంపెనీల రాకెట్లు కూడా ఉన్నాయి. మొదటి ప్రయోగం సెప్టెంబర్ 15న జియుక్వాన్ ఉపగ్రహ ప్రయోగ కేంద్రం నుంచి జరిగింది.

ల్యాండ్‌స్పేస్ సంస్థకు చెందిన జుక్యూ-2ఈ రాకెట్ 10 ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చింది. క్వియాన్‌ఫాన్ బ్రాడ్‌బ్యాండ్ మెగా శాటిలైట్ నెట్‌వర్క్ కోసం వీటిని పంపారు. ఈ నెట్‌వర్క్‌లో భవిష్యత్తులో దాదాపు 15 వేల ఉపగ్రహాలను ప్రవేశపెట్టాలని చైనా లక్ష్యంగా పెట్టుకుంది. అదేరోజు షాంఘై సముద్ర తీరంలోని మొబైల్ ప్లాట్‌ఫామ్ నుంచి ఒరియెన్‌స్పేస్ గ్రావిటీ-1 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ఇది మరో తొమ్మిది క్వియాన్‌ఫాన్ ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చింది.

ఘన ఇంధనంతో పనిచేసే ఈ రాకెట్ ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సాలిడ్ ఫ్యూయల్ రాకెట్‌గా గుర్తింపు పొందింది. మూడో ప్రయోగం హైనాన్ దీవిలోని వెన్‌చాంగ్ కేంద్రం నుంచి జరిగింది. ప్రభుత్వ రంగానికి చెందిన లాంగ్ మార్చ్-12 రాకెట్ తొమ్మిది ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపింది. ఇవి సాట్‌నెట్ పేరుతో ఏర్పాటు చేస్తున్న మరో భారీ బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్ కోసం ఉద్దేశించినవి. ఇందులో దాదాపు 13 వేల ఉపగ్రహాలను ప్రవేశపెట్టే ప్రణాళిక ఉంది.

నాలుగో ప్రయోగంతో ఈ వరుస ముగిసింది. జియుక్వాన్ నుంచి కుయ్‌జౌ-11 రాకెట్ రెండు రాడార్ భూ పరిశీలన ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చింది. మొత్తంగా నాలుగు ప్రయోగాల్లో 30 ఉపగ్రహాలను చైనా కక్ష్యలోకి పంపింది. ఈ నాలుగు ప్రయోగాలు చైనా అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థల పాత్ర పెరుగుతున్న విషయాన్ని కూడా చూపించాయి. అయితే ఈ నాలుగు ప్రయోగాల్లో ఏ రాకెట్ బూస్టర్‌ను తిరిగి భూమికి తీసుకురాలేదు. కాగా జుక్యూ-3, లాంగ్ మార్చ్-10 బీ రాకెట్ల తొలి దశలను విజయవంతంగా ల్యాండ్ చేసి పునర్వినియోగ సాంకేతికతలో చైనా ముందడుగు వేసింది.

# ఢిల్లీలో దారుణం.. ఆరో తరగతి బాలికను బంధించి అత్యాచారం చేసిన టైలర్

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 21: దేశ రాజధాని ఢిల్లీలో దారుణ ఘటన జరిగింది. ఆరో తరగతి చదివే బాలికను బంధించిన ఒక టైలర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఢిల్లీ, సదర్ బజార్‌లో ఈ నెల 16న రాత్రి 11.00 గంటలకు జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.

ఈ ప్రాంతంలో కుటుంబంతో కలిసి ఉంటున్న ఒక బాలిక ఆరో తరగతి చదువుతోంది.

సెప్టెంబర్ 16న రాత్రి 11.00 గంటలకు స్కూల్‌కు అవసరమైన కొన్ని వస్తువులు కొనేందుకు ఆ బాలిక బయటకు వెళ్లింది. బాలిక వెళ్లే దారిలో ఒక టైలరింగ్ షాపు ఉంది. బాలిక ఒంటరిగా ఉండటం గమనించి ఆ షాపు ఓనర్ కం టైలర్ అయిన మక్సూద్.. బాలికకు మాయమాటలు చెప్పాడు. తన షాపులోకి రమ్మన్నాడు. షాపులోకి వచ్చిన బాలికపై మక్సూద్ అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం బాలిక షాపు నుంచి ఇంటికి వచ్చిన బాలిక కుటుంబ సభ్యులకు విషయం చెప్పింది.

దీంతో వారు సదర్ బజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎఫ్ఐ నమోదు చేసిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. నిందితుడు మక్సూద్‌ను అరెస్టు చేశారు. అతడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బాలికను వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఈ ఘటనపై విచారణ జరుగుతోందని, నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని పోలీసులు తెలిపారు.

# యుద్ధాలు, ఘర్షణల నడుమ సమావేశం కాబోతున్న ఐక్యరాజ్యసమితి.. మోదీ, జిన్‌పింగ్, పుతిన్ లేకుండానే..!

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21:ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో తీవ్రమైన యుద్ధాలు, ఘర్షణలు కొనసాగుతున్నాయి. ఈ యుద్ధాలు, ఘర్షణల నడుమనే ఈ వారం ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ వార్షిక ఉన్నతస్థాయి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ కీలక భేటీకి 140 మంది ప్రపంచ నేతలు, మరో 53 దేశాల ప్రతినిధులు హాజరవుతున్నారు. గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తతలు, ఉక్రెయిన్ యుద్ధం, గాజా లో సంక్షోభం, సూడాన్ లో కొనసాగుతున్న అంతర్యుద్ధం వంటి అంశాలు ఈ సమావేశాలపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి.


మంగళవారం ఈ సమావేశాలు ప్రారంభం కానుండగా.. సంప్రదాయం ప్రకారం ముందుగా బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డా సిల్వా తొలి ప్రసంగం చేయనున్నారు. అనంతరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రసంగిస్తారు. అయితే ఈసారి సమావేశాలకు భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వంటి ముగ్గురు కీలక నేతలు గైర్హాజరవుతున్నారు. భారత్ తరఫున విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ శనివారం సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

'విశ్వాసాన్ని పునరుద్ధరించడం, పరివర్తనను నిర్వహించడం : అందరి కోసం పనిచేసే ఐరాస' అనే థీమ్‌తో ఈ ఏడాది సమావేశాలు జరగనున్నాయి. వాతావరణ మార్పులు, ఉగ్రవాదం, ప్రపంచ ఆకలి, పేదరికం వంటి శాశ్వత సమస్యలతోపాటు కృత్రిమ మేధ (ఏఐ) తో ముంచుకొస్తున్న ప్రమాదాలపై కూడా ప్రధానంగా చర్చించనున్నారు. ఐరాస సర్వప్రతినిధి సభ అధ్యక్షుడిగా ఎన్నికైన బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి ఖలీలుర్ రెహమాన్ ఈ సమావేశాలకు అధ్యక్షత వహిస్తారు.

ప్రధాన సభలో నేతల ప్రసంగాలు లాంఛనప్రాయంగా సాగినా.. అసలైన చర్చలు, దౌత్యపరమైన మంతనాలు మాత్రం తెరవెనుకే జరుగుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ కూడా ఇదే విషయాన్ని స్పష్టంచేశారు. గత ఏడాది ఇలాంటి సమావేశాల సందర్భంగానే అమెరికా, కొన్ని ముస్లిం దేశాల మధ్య జరిగిన చర్చల ఫలితంగా గాజా శాంతి ప్రణాళిక రూపుదిద్దుకుందని ఆయన గుర్తుచేశారు. ఈ విషయంలో ఐరాసను విమర్శించే ట్రంప్ కూడా ఏకీభవించడం గమనార్హం.

ఈ సమావేశాల్లో కొన్ని ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకోనున్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రసంగం చేసిన మరుసటి రోజే, ఆ దేశ ప్రత్యర్థి అయిన ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ ప్రసంగించనుండటం ఉత్కంఠ రేపుతోంది. మరోవైపు గాజాలో తమ చర్యలను సమర్థించుకోవడానికి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు గురువారం ప్రసంగించనుండగా.. పాలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్‌కు అమెరికా వీసా నిరాకరించడం వివాదాస్పదంగా మారింది.

# సుద్దాల అశోక్ తేజకు "తెలంగాణ తెలుగు తేజం" ప్రదానోత్సవం



(సుద్దాల అశోక్ తేజ్‌కు "తెలంగాణ తెలుగు తేజం" రాష్ట్రస్థాయి పురస్కార ప్రదానోత్సవం సందర్భంగా)

ప్రముఖ కవి, జాతీయ ఉత్తమ సినీగేయ రచయిత, సాహిత్యకారుడు తెలంగాణ ముద్దు బిడ్డ సుద్దాల అశోక్ తేజ తెలియని తెలుగు వారు ఉండరు అనేది అతిశయోక్తి కాదు. తెలంగాణ ఉద్యమంలో నిర్వహించిన కీలక పాత్రను గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 02 జూన్ 2025న రూ: కోటి నగదుతో సముచిత సన్మానం స్వీకరించారు. ప్రస్తుతం తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సలహాదారుల కమిటీ సభ్యుడిగా కూడా కొనసాగుతున్న సుద్దాల అశోక్ తేజ రెండు తెలుగు రాష్ట్రాలకు స్వచ్ఛ భారత్ బ్రాండ్ అంబాసిడర్‌గా కూడా ఎంపికైనారు. ఇప్పటి వరకు 2000లకు పైగా సినిమాలకు 3000లకు పైగా పాటలు రచించి అప్రతిహతంగా కవన సాగును కొనసాగుతున్నారు. 2003లో విడుదలైన ఠాగూర్ సినిమాకు రాసిన "నేను సైతం" అనే పాటకు 2014లో జాతీయ ఉత్తమ సినీగీత రచయితగా ప్రతిష్టాత్మక పురస్కారం పొందిన తొలి తెలంగాణ వాసిగా రికార్డు సృష్టించారు. సుద్దాల అశోక్ తేజ 26 ఏండ్ల సినీ పాటల ప్రస్థానం అప్రతిహతంగా ముందుకు సాగుతూ, సంగీత ప్రపంచాన్ని సుసంపన్నం చేస్తున్నారు. నా కన్న ముందే నా ఇంట్లో పాట పుట్టింది అన్న అశోక్ తేజ సినీ గేయ రచయితగా రాణించడానికి ముందు ఎన్నో కష్టాలను అనుభవించారు.

**బాల్యం, ఉపాధ్యాయ వృత్తిలో అశోకుడు :**

16 మే 1960 రోజు ప్రముఖ తెలుగు ప్రజా కవి సుద్దాల హనుమంతు - జానకమ్మ పుణ్య దంపతులకు యాదాద్రి భువనగిరి జిల్లా, గుండాల మండలం, సుద్దాల గ్రామంలో జన్మించిన గుర్రం అశోక్ తేజ గతంలో ఉపాధ్యాయుడిగా కూడా సేవలు అందించారు. తల్లితండ్రులు ఇద్దరు స్వాతంత్ర్య సమరయోధులుగా నాటి నిజాం పాలన, రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా పోరాడుతూ తెలంగాణ విమోచనోద్యమంలో క్రియాశీల పాత్రను పోషించారు. భువనగిరి జిల్లాలో జన్మించిన అశోక్ తేజ తర్వాత జగిత్యాల జిల్లా, మెట్‌పల్లికి మారి బండలింగాపూర్, మేడిపల్లి, మెట్‌పల్లి గ్రామాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేశారు. "పల్లెటూరు పిల్లగాడా పసులగాచే మొనగాడా" అనే జనాలు మెచ్చిన ఉద్యమ గీత రచయిత అయిన తండ్రి ప్రముఖ ప్రజాకవి సుద్దాల హనుమంతు సాహిత్య వారసత్వాన్ని ఉగ్గు పాలతోనే జీర్ణించుకొని కవన సేద్యం ప్రారంభించి ప్రజలు మెచ్చిన రుచికరమైన కవిత్వాన్ని పండించి వడ్డిస్తున్నారు.

**సినీ గేయ రచయితగా ప్రస్థానం:**

తనికెళ్ళ భరణి లాంటి చలన చిత్ర నటుల ప్రోత్సాహంతో "నమస్తే అన్న" సినిమాకు తొలిసారి పాటలు రాసి టాలీవుడ్ రంగుల ప్రపంచంలో కలం కాలు మోపారు. తండ్రి నీడన ఎదిగిన అశోక్ తేజ తొలి నాళ్లలో విప్లవ గీతాలు రాయడం ప్రారంభించినా నాటి ప్రముఖ దర్శకులు దాసరి నారాయణ రావు ప్రోత్సాహంతో తెలుగు సినిమా క్షేత్రంలో చలన చిత్ర గేయ రచయితగా తన స్థానాన్ని సుస్థిరపరుచుకున్నారు. దర్శకులు కృష్ణవంశీ ప్రోద్బలంతో అన్ని రకాల పాటలను సమర్థవంతంగా రాసి మెప్పించారు. 1996-97 సంవత్సరంలో విడుదలైన "ఒసేయ్ రాములమ్మ",నిన్నే పెళ్ళాడుతా" సినిమాలకు రాసిన పాటలతో మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్నారు. 2003లో ఠాగూర్ సినిమాకు రాసిన "నేను సైతం"అనే పాటకు ఉత్తమ జాతీయ సినీ గేయ రచయితగా అవార్డు అందుకున్న మూడవ తెలుగు కవిగా పేరు తెచ్చుకున్నారు. గతంలో ప్రముఖ తెలుగు కవులు శ్రీ శ్రీ, వేటూరి ద్వయం కూడా ఈ పురస్కారాన్ని అందుకున్న జాబితాలో ఉన్నారు. 2017లో విడుదలైన ఫిదా సినిమాకు "వచ్చిండే, పిల్లా మెల్లామెల్లగా వచ్చిండే" అనే పాట రాసిన తేజకు ఉత్తమ తెలుగు సినీ గీత రచయితగా సైమా అవార్డును అందుకున్నారు. 2017 వరకే 1250 సినిమాలకు గాను 2200 పాటలకు రచించి చరిత్ర సృష్టించారు. వీటికి తోడుగా 2500లకు పైగా ప్రైవేట్ పాటలు లిఖించారు.

**సుద్దాల అశోకుడి పాటల పూదోట:**

భద్రాచలం సినిమాకు "ఒకటే జననం ఒకటే మరణం", గురి సినిమాకు "నేలమ్మా నేలమ్మా నేలమ్మా", ప్రసిద్ధ ప్రైవేట్ పాటగా "ఆలి నీకు దండమే, అర్ధాంగి నీకు దండమే", రఘుమ్మంది నాదం సినిమాకు "ఏం సక్కగున్నావో నా సొట్టసేంపలోడా", గోవిందుడు అందరి వాడేలే చిత్రానికి "నీలి రంగు చీరలోన చందమామ నీవే జానా" లాంటి వేల సినిమా పాటలు రాసి వెండితెర వెలుగులను ఇనుమడింపజేశారు. ప్రముఖ తెలుగు సాహితీవేత్తగా స్మృతి గీతం, వెలుగు రాకలు (నవల), ఆకుపచ్చ చందమామ, బతుకు పాట, వీర తెలంగాణ యక్ష గానం, నా పాటలు, శ్రమ కావ్యం లాంటి పలు రచనలు చేసి మెప్పించారు. సుద్దాల అశోక్ తేజ "రిలిక్స్ ఆఫ్ టాయిల్", "ఐ ఆమ్, ది ఫారెస్ట్, స్పీకింగ్" రచనలు ఇంగ్లీష్‌లో కూడా విడుదల అయ్యాయి. తన సాహిత్య జీవితాన్ని మార్చి వేసిన పాట "నేలమ్మా నేలమ్మా నేలమ్మా"అనే గీతం నిలిచి పోయింది. "టప టప టప టప టప టప చెమట బొట్లు తాళాలై పడుతుంటే, కరిగి కండరాల నరాలే స్వరాలు కడుతుంటే, పాటా పనితో పాటే పుట్టింది, పని పాటతోటే జత కట్టింది" అనే విప్లవ ఉద్యమ గీతం మనకు సదా గుర్తిండి పోయింది.

**సుద్దాల కలాన్ని ముద్దాడి పులకించిన పురస్కారాలు :**

సుద్దాల అశోక్ తేజ కలం నుంచి జాలువారిన అనేక పాటలకు తెలుగు ప్రేక్షకులు అభినందనల హారతి పట్టారు. వారి సాహిత్య సాగును (సాంగులను) గుర్తించిన పలు ప్రతిష్ఠాత్మక సంస్థలు అవార్డులతో సత్కరించాయి. జాతీయ ఉత్తమ గేయ రచయిత, సైమా పురస్కారాలతో పాటు మహాత్మా జ్యోతి పూలే, తెలుగు విశ్వవిద్యాలయం, తెలుగు అధికార భాష, వంశం అంతర్జాతీయ, ఆత్రేయ మనస్విని, సినీ గోయర్స్, బిఎన్ రెడ్డి సాహిత్య, భరతముని, సినారే సాహిత్య, గురుజాడ విశిష్ట, నాగభైరవ కోటేశ్వరరావు, ఎన్‌టిఆర్ తెలుగు ఆత్మగౌరవ, కొమరం భీం జాతీయ, కొండేపూడి శ్రీనివాసరావు సాహితీ పురస్కారాలు అనేకం అందుకున్న సుద్దాల అశోక్ తేజ తన సాహితీ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు. 2010లో సుద్దాల ఫౌండేషన్‌ను స్థాపించి తన తల్లితండ్రుల పేరిట "సుద్దాల హనుమంతు-జానకమ్మ సాహితీ పురస్కారాల"ను ప్రతి ఏటా అందిస్తున్నారు. ఇప్పటి వరకు బి నర్సింగరావు, గద్దర్, తీజన్ బాయి, ఎన్ గూగి వాధియాంగో, సిరిసిల్లా రాజేశ్వరి, గూడ అంజయ్య, గోరేటి వెంకన్న, వంగపండు ప్రసాదరావు, జయరాజు, ఆర్ నారాయణ మూర్తి, అందెశ్రీ లాంటి ప్రముఖులకు అందించి తన సాహిత్య ప్రేమను చాటుతున్నారు.

**తెలంగాణ తెలుగు తేజం పురస్కార ప్రదానోత్సవం :**

ప్రతి ఏటా అందించే బుర్ర నర్సమ్మ-లింగారెడ్డి స్మారక "తెలంగాణ తెలుగు తేజం" పురస్కారానికి ఎంపికైన సుద్దాల అశోక్ తేజ 22 సెప్టెంబర్ 2026 రోజు సాయంత్రం కరీంనగర్ ఫిలిం భవన్‌లో తెలుగు భాషా సంరక్షణ సంఘం రాష్ట్ర వేదికగా ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. తెలుగు సినీ సాహితీవనంలో గులాబీ పువ్వులా గుబాళిస్తూ, కవన పరిమళాలను పంచుతూ వెలుగొందుతున్న తెలుగు తేజోమయ అశోక్ తేజ రానున్న రోజుల్లో తెలంగాణ తెలుగు తేజంగా వెలుగొందాలని కోరుకుందాం.


జి.వి. శ్యాంప్రసాద్ లాల్, ఐఏఎస్, ముఖ్య అతిధిగా హాజరు అవుతున్న కార్యక్రమంలో తెలుగు భాషా సంరక్షణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పురస్కార ప్రదాత కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, సంస్థ అధ్యక్షులు దాస్యం సేనాధిపతి సభాధ్యక్షత వహించనుండగా శ్రీమతి బుర్ర జానకి రెడ్డి సభా ప్రారంభకులుగా హాజరు అవుతున్నారు.

సుద్దాల అశోకుడి పాటలను అలసటకు లేపనంగా ప్రతి ఒక్కరూ ఆలపిస్తూ, అలుపెరుగక పనులను పూర్తి చేస్తూ, అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ, వడివడిగా అడుగులు వేయాలి. ఇలాంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలను మరెన్నో తేజ మనసుకు హత్తుకోవాలని తెలంగాణ కోరుకుంటున్నది.



-మధుపాళీ
9949700037

# డీసీసీ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన జగ్గారెడ్డి



సంగారెడ్డి సెప్టెంబర్ 20(నేటి నిజం ప్రతినిధి) సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నూతన అధ్యక్షుడిగా పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి నియమితులైన సందర్భంగా నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డితో కలిసి సంగారెడ్డి పట్టణంలోని రామ్ మందిరాన్ని సందర్శించారు.


ఈ సందర్భంగా రామ్ మందిరంలోని వినాయక మండపంలో గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన భజన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

భజన కార్యక్రమం అనంతరం జగ్గారెడ్డిని ఎమ్మెల్యే సంజీవరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రశేఖర్‌రెడ్డికి జగ్గారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి పటిష్టం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ వినోద్ పాటిల్, నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పండరి రెడ్డి, విఠల్‌రావు పాటిల్, నగల్‌గిద్ద మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ యాదవ్‌రెడ్డి, నారాయణఖేడ్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్ధారెడ్డి, రవీందర్ పాటిల్, నారాయణరెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# గూడమామడలో పెన్షన్ దరఖాస్తుల పరిశీలన

## అర్హత, ధ్రువపత్రాల పరిశీలన అనంతరం ప్రభుత్వానికి నివేదిక



ఆదిలాబాద్, సెప్టెంబర్ 21: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు చేయూత పెన్షన్లు మంజూరు చేసేందుకు ఆన్‌లైన్‌లో స్వీకరించిన దరఖాస్తులను అధికారులు పరిశీలిస్తున్నారు. సోమవారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని గూడమామడ గ్రామపంచాయతీలో సర్పంచ్ కుమ్ర యశోద కేశవ్ ఆధ్వర్యంలో పెన్షన్ దరఖాస్తుదారులతో సమావేశం నిర్వహించారు.

దరఖాస్తుదారుల వివరాలు, ధ్రువపత్రాలను పరిశీలన అధికారి, సీడీపీవో సృజన పరిశీలించారు. ఒంటరి మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు పెన్షన్ల కోసం చేసుకున్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ప్రభుత్వానికి పంపిస్తామని ఆమె తెలిపారు. అర్హత ఉన్న వారికి పెన్షన్లు మంజూరవుతాయని సృజన, సర్పంచ్ కుమ్ర యశోద కేశవ్ తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కరాడే శివాజీ, పంచాయతీ కార్యదర్శి జాదవ్ ప్రేమ్ సింగ్, పెన్షన్ దరఖాస్తుదారులు పాల్గొన్నారు. గూడమామడలో పెన్షన్ దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న సీడీపీవో సృజన, సర్పంచ్ కుమ్ర యశోద కేశవ్

# పిడుగుపాటుతో రెండు గొర్రెలు మృతి

ఆదిలాబాద్, సెప్టెంబర్ 21:నిర్మల్ జిల్లా కుంటాల మండలం విట్టాపూర్ గ్రామంలో ఆదివారం పిడుగుపాటు ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు పంట పొలాల్లో గొర్రెలను మేపుతుండగా ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అదే సమయంలో సమీపంలోని చెట్టుపై పిడుగు పడటంతో రెండు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. గొర్రెలను మేపుతున్న బేగడి చిన్న సాయన్న, లింగన్న, ధనంజయ్‌లకు గాయాలయ్యాయి. గ్రామస్థులు వెంటనే వారిని బైంసా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పిడుగు పడిన సమయంలో పెద్ద శబ్దంతో చెట్టుపై నిప్పు రవ్వలు చెలరేగి కిందకు పడటంతో ముగ్గురు కాపరులు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.

# 20వ రోజ్‌గార్ మేళాలో ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన 51,000కు పైగా యువతకు నియామక పత్రాలు అందించిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 21:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, 20వ 'రోజ్‌గార్ మేళా'లో భాగంగా వివిధ ప్రభుత్వ సంస్థల్లో కొత్తగా నియమితులైన 51,000కు పైగా యువతకు నియామక పత్రాలను అందజేశారు. ఈ రోజు వీడియో అనుసంధానం ద్వారా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ... ఒక మైలు రాయిగా నిలిచే ఈ కార్యక్రమం వేలాది కుటుంబాలకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. ఇది అభ్యర్థుల వ్యక్తిగత కృషికి, వారి తల్లిదండ్రుల అపారమైన త్యాగాలకు తగిన గుర్తింపు అవుతుందని ఆయన పేర్కొన్నారు. "జీవితంలో ఈ కొత్త ఆరంభం కోసం మీ అందరికీ నా శుభాకాంక్షలు" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించే మహత్తర లక్ష్యం దిశగా భారత్ పురోగమిస్తున్న తరుణంలో... భారత ప్రభుత్వంలో కొత్తగా నియమితులైన ఉద్యోగులకు శ్రీ మోదీ స్వాగతం పలికారు. ప్రతి పరిపాలన పరమైన నిర్ణయం ద్వారా అభివృద్ధి చెందిన భారత్, స్వయం-సమృద్ధ భారత్ అనే రెండు లక్ష్యాలను సాకారం చేసుకునే ప్రయత్నాలను నిరంతరం బలోపేతం చేయడంలో యువత కీలక పాత్ర పోషిస్తోందని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. తోటి యువత పట్ల మన యువతకు ప్రత్యేక బాధ్యత ఉందని శ్రీ మోదీ ప్రముఖంగా ప్రస్తావించారు. మన యువతరం ప్రతిభ, నైపుణ్యాలు ప్రపంచ విశ్వాసాన్ని చూరగొన్నాయని... ఇది భారతీయ ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలు, యువశక్తిపై ప్రపంచ వ్యాప్తంగా అపారమైన అంచనాలను పెంచుతోందని ఆయన పేర్కొన్నారు. "మన ఆవిష్కర్తలు, మన పారిశ్రామికవేత్తలు, మన యువశక్తిపై ప్రపంచానికి ఎన్నో ఆశలు ఉన్నాయి" అని శ్రీ మోదీ ఉద్ఘాటించారు.

ఇటీవల ముగిసిన బ్రిక్స్ సదస్సును గురించి ప్రస్తావిస్తూ... సాంప్రదాయికంగా సాగే ఇరు దేశాల ప్రభుత్వాల మధ్య పరస్పర సహకారానికి మించి అంతర్జాతీయ సహకారాన్ని విస్తరించడమే ప్రభుత్వ వ్యూహమని ప్రధానమంత్రి పేర్కొన్నారు. మన పారిశ్రామికవేత్తలు, రైతులు, మహిళలు, యువతను నేరుగా ప్రపంచ భాగస్వామ్యాల్లో భాగమయ్యేలా బ్రిక్స్ కనెక్ట్, బ్రిక్స్ ఎంఎస్ఎంఈ కోఆపరేషన్ పోర్టల్ వంటి కార్యక్రమాలను రూపొందించినట్లు ఆయన వివరించారు. "ప్రతి ఒక్కరూ ఈ భాగస్వామ్యంలో చురుగ్గా పాలుపంచుకోవాలి" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

గత కొన్నేళ్లుగా కొనసాగుతున్న ఆర్థిక దౌత్యాన్ని ప్రస్తావిస్తూ... సుమారు 40 దేశాలతో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు అపూర్వ రీతిలో అపారమైన ఉద్యోగావకాశాలను కల్పిస్తున్నాయని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఈ ఒప్పందాలు దేశీయ పారిశ్రామికవేత్తలకు కొత్త మార్కెట్లను, చైతన్యవంతమైన భాగస్వామ్యాలను అందుబాటులోకి తెస్తున్నాయని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలను విస్తృతం చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. "ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు మన యువతకు కొత్త అవకాశాలను అందుబాటులోకి తెస్తున్నాయి" అని శ్రీ మోదీ ధ్రువీకరించారు.

భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించడంపై ప్రభుత్వం నిరంతరం చూపుతున్న శ్రద్ధను వివరిస్తూ... ప్రధానమంత్రి జాతీయ విద్యా విధానం, స్కిల్ ఇండియా మిషన్, ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన, అప్రెంటీస్‌షిప్ విధానాన్ని ప్రోత్సహించడం వంటి కీలక కార్యక్రమాలను ఆయన ప్రస్తావించారు. పరిశ్రమల ప్రత్యక్ష భాగస్వామ్యం ద్వారా వచ్చిన 60,000 కోట్ల రూపాయల పెట్టుబడులతో వెయ్యి ప్రభుత్వ ఐటీఐలను ఆధునికీకరిస్తున్న 'పీఎం-సేతు' పథకాన్నీ ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. "యువత విద్య, నైపుణ్యాలు మారుతున్న ఆర్థిక వ్యవస్థ అవసరాలకు అనుగుణంగా ఉండేలా చూడటమే మా లక్ష్యం" అని శ్రీ మోదీ ఉద్ఘాటించారు.

దేశీయ అంకుర సంస్థల వ్యవస్థ సాధించిన అద్భుతమైన వృద్ధిని ప్రశంసిస్తూ... ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ కేంద్రంగా దేశం నిలిచినందుకు ప్రధానమంత్రి అభినందనలు తెలిపారు. ప్రస్తుతం గుర్తింపు పొందిన అంకుర సంస్థల్లో దాదాపు సగం ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల నుంచే వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. చిన్న పట్టణాల యువత తమ ఆలోచనలపై చురుగ్గా పనిచేస్తూ, కంపెనీలను నిర్మిస్తూ, తమ తోటివారికి కొత్త ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నారని అభినందించారు. "నేడు భారత నూతన ఆర్థిక వ్యవస్థలో గ్రామాలు, పట్టణాలు, చిన్న నగరాల యువత ప్రధాన పాత్ర పోషిస్తున్నారు" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

రెండు కోట్ల మంది యువతను తొలిసారిగా అధికారిక కార్మిక శక్తిలో భాగం చేయడమే లక్ష్యంగా లక్ష కోట్ల రూపాయలతో చేపట్టిన భారీ కార్యక్రమమైన 'ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన'నూ ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ పథకం కింద తొలిసారి ఉద్యోగంలో చేరే వారికి 15,000 రూపాయల వరకు ప్రోత్సాహకాలు అందించడంతో పాటు, కొత్త ఉద్యోగాలను కల్పించే యజమానులకూ ఆర్థికంగా ప్రతిఫలం లభిస్తుందని ఆయన వివరించారు. "దేశంలో ఉపాధిని పెంపొందించడానికి ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోంది" అని శ్రీ మోదీ ధ్రువీకరించారు.

ఉపాధి కల్పనను పటిష్ఠమైన స్థూల ఆర్థిక వ్యవస్థతో అనుసంధానిస్తూ... ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెంది, పెట్టుబడులు పెరిగి, కొత్త పరిశ్రమలు విస్తరించినప్పుడే యువతకు నూతన అవకాశాలు లభిస్తాయని ప్రధానమంత్రి వివరించారు. దేశం సాధించిన 7.8 శాతం వృద్ధి రేటును, మొదటి త్రైమాసికంలో పెట్టుబడుల్లో నమోదైన 12 శాతం పెరుగుదలను ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ... మెరుగవుతున్న దేశ ఆర్థిక దృక్పథాన్ని రేటింగ్ ఏజెన్సీలు స్పష్టం చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. "భారత్ సాధించిన ఈ వృద్ధిలో గత కొన్నేళ్లుగా చేపట్టిన సంస్కరణల పాత్ర ఎంతో ఉంది" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

నిరంతర పరిపాలన పరివర్తన శకాన్ని స్వీకరించాలని కొత్త అధికారులను ఆదేశిస్తూ... పన్నుల విధానాన్ని సరళీకరించడం, వ్యాపార నిర్వహణ సౌలభ్యాన్ని పెంపొందించడం, విద్య-నైపుణ్యాభివృద్ధిలో సంస్కరణలను అమలు చేయడం, నూతన రంగాల్లో ఆవిష్కరణలను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాల ఆవశ్యకతను ప్రధానమంత్రి స్పష్టం చేశారు. తమ పదవీ కాలమంతా పరిపాలన పరమైన సంస్కరణలు మెరుగైన వేగంతో అప్రతిహతంగా కొనసాగేలా చూడాలని ఆయన యువ అధికారులను కోరారు. "దేశంలో సంస్కరణల ఎక్స్‌ప్రెస్ పూర్తి వేగంతో నిరంతరం పరుగెత్తడం అవసరం" అని శ్రీ మోదీ ఉద్ఘాటించారు.


కెరటాలను జయించడానికి సూర్యుడిని, సముద్రాన్ని, పడవను, నావికుడిని మన సొంతం చేసుకోవాలంటూ తాను గతంలో చెప్పిన కవితాత్మక వ్యాఖ్యలను ప్రధానమంత్రి గుర్తుచేశారు. దేశ యువత గొప్ప ఆశయాలకు అండగా నిలుస్తూ, ధైర్యసాహసాలను ప్రదర్శించాలని ఆయన కొత్తగా విధుల్లోకి చేరిన వారికి పిలుపునిచ్చారు. ప్రతీ ఫైలుపై చేసే సంతకం, తీసుకునే ప్రతీ పరిపాలన నిర్ణయం.. అడ్డంకులను తొలగించే, కొత్త ఆలోచనలు చిగురింపజేసే, ఉద్యోగాలను సృష్టించే ఆవిష్కరణలతో కూడిన పెట్టుబడులను ప్రోత్సహించేలా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. "మీరు ప్రతీ ఫైలుపై చేసే సంతకం యువత ఆశయాలను ముందుకు తీసుకెళ్లేదిగా ఉండాలి" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

వారి వ్యక్తిగత అనుభవాలను గురించి ప్రస్తావిస్తూ, ప్రభుత్వ వ్యవస్థలో తమకు లభించిన కొత్త అధికారాలను పూర్తి సహానుభూతితో వినియోగించుకోవాలని ప్రధానమంత్రి నూతనంగా నియమితులైన అధికారులను కోరారు. ఈ సర్వీసులో చేరడానికి ముందు తాము స్వయంగా ఎదుర్కొన్న అధికారికపరమైన అవరోధాలను తొలగించే దిశగా చురుగ్గా చర్యలు చేపట్టాలని వారికి సూచించారు. "తాము అనుభవించిన ఇబ్బందులను ఇతర యువత ఎదుర్కోవాల్సిన పరిస్థితి రాకూడదన్నదే మీ ప్రయత్నంగా ఉండాలి" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

వేగంగా మారుతున్న ప్రపంచంలో జీవిత కాలమంతా నేర్చుకోవడం కొనసాగించాలనే మనస్తత్వాన్ని ప్రోత్సహిస్తూ... 'మిషన్ కర్మయోగి' విధాన ప్రణాళిక ద్వారా కొత్తగా చేరినవారు తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని సూచించారు. నూతన సాంకేతికతల్లో ప్రావీణ్యం సంపాదించాలని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఇప్పటికే ఐజీవోటీ ప్లాట్‌ఫామ్‌లో ఉన్న 1.7 కోట్ల మంది ఉద్యోగులతో పాటు, కొత్తగా చేరేవారికి ఈ వ్యవస్థలో నిలదొక్కుకోవడంలో సహాయపడటానికి 'కర్మయోగి ప్రారంభ్' మాడ్యూల్‌ను ప్రత్యేకంగా రూపొందించినట్లు ఆయన తెలిపారు. "మిమ్మల్ని మీరు ఎంతగా మెరుగుపరుచుకుంటే, మీరు దేశ పౌరుల కోసం అంత ఉత్తమంగా సేవ చేయగలుగుతారు" అని శ్రీ మోదీ ఉద్ఘాటించారు.

ఏ ప్రభుత్వానికైనా నిజమైన బలం ప్రజల విశ్వాసంలోనే ఉంటుందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. వృద్ధుల పింఛన్ల మంజూరు, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, రైతు రాయితీల వంటి వారి రోజువారీ పనులు సామాన్య ప్రజల జీవితాలపై ప్రత్యక్షంగా ప్రభావం చూపుతాయని ప్రధానమంత్రి కొత్తగా చేరిన ఉద్యోగులకు గుర్తుచేశారు. వారి ప్రవర్తన, సామర్థ్యం, నిజాయతీ, సున్నితత్వమే అంతిమంగా ప్రభుత్వంతో పౌరుడికి కలిగే వ్యక్తిగత అనుభవాన్ని నిర్వచిస్తాయని ఆయన స్పష్టం చేశారు. "మీ ప్రవర్తన, మీ సున్నితత్వం, మీ సామర్థ్యం, మీ నిజాయతీ... ఇవన్నీ ప్రభుత్వంతో పౌరులకు కలిగే అనుభవాన్ని నిర్ణయిస్తాయి" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.


DECCAN HERITAGE ACADEMY TRUST




**పుస్తకావిష్కరణ ఆహ్వానం**

మాదారపు వాణిశ్రీ
రచించిన నవల
**పూటకూళ్ళవ్వ**

తేది : 22 సెప్టెంబర్ 2026,
మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు

వేదిక : ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్, వీధి నెం.13,
హిమాయత్ నగర్, హైదరాబాద్ - 500029.

అధ్యక్షులు:
డా. ఎస్. రఘు
అసోసియేట్ ప్రొఫెసర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం

ఆవిష్కర్త:
కె. ఆనందాచారి
అసోసియేట్ ఎడిటర్, నవతెలంగాణ

ఆత్మీయ వాక్యం:
మణికొండ వేదకుమార్
చైర్మన్, దక్కన్ హెరిటేజ్ అకాడమి ట్రస్ట్

సమీక్ష:
డా. కొండపల్లి నిహారిణి
ప్రముఖ కవయిత్రి, విమర్శకులు

సమన్వయం:
డా. ఇడికోజు శ్రీనివాసాచారి
కవి, పరిశోధకుడు

దక్కన్ హెరిటేజ్ అకాడమి ట్రస్ట్

# అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ పరస్పరం ముందుకు వెళ్తాయని భారత్ నిరూపిస్తోంది: పీఎం

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 21:న్యూఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో "పర్యావరణం, వాతావరణ పరిణామాల భవిత" అంశంపై అంతర్జాతీయ సదస్సును గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేశానికి ప్రకృతితో ఉన్న చారిత్రక సంబంధాన్ని వివరించారు. మన ప్రాచీన సాంస్కృతిక జ్ఞానం ఆధునిక వాతావరణ పరిష్కారాలను రూపొందించే తీరు, ప్రపంచ సమష్టి చర్యలకు స్ఫూర్తినిచ్చే విధానాన్ని వివరించారు. ఈ కీలకమైన మిషన్‌ను నిబద్ధతతో ముందుకు నడిపిస్తున్నందుకు జాతీయ హరిత ట్రిబ్యునల్‌కు, నిర్వాహకులకు అభినందనలు తెలిపారు."ఆధునిక వాతావరణ సవాళ్లకు భారత్ పరిష్కారాలను అందిస్తోంది" అని శ్రీ నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

కర్బన ఉద్గారాలపై ప్రపంచ వ్యాప్తంగా ప్రచారంలో ఉన్న తప్పుడు వాదనలను ప్రస్తావిస్తూ... అభివృద్ధి చెందిన దేశాలు భారత్ కంటే ఆరు రెట్లు ఎక్కువగా తలసరి కర్బన ఉద్గారాలను విడుదల చేస్తున్నప్పటికీ, అభివృద్ధి చెందుతున్న దేశాలనే అన్యాయంగా నిందిస్తున్నట్లు ప్రధాన మంత్రి తెలిపారు. ఈ చారిత్రక సత్యాన్ని ప్రపంచ వేదికలపై లేవనెత్తేందుకు, దేశంలోని సంప్రదాయ పర్యావరణ శక్తిని చాటిచెప్పేందుకు భారత్ కృషి చేస్తున్న తీరుని ఆయన వివరించారు. కాప్-21 సదస్సులో "కన్వీనియంట్ యాక్షన్ - కంటిన్యూటీ ఫర్ చేంజ్" పుస్తకాన్ని ఆవిష్కరించటాన్ని... వన్ సన్, వన్ వరల్డ్, వన్ గ్రిడ్, అంతర్జాతీయ సౌర కూటమి, సీడీఆర్ఐ, గ్లోబల్ బయోఫ్యూయల్ అలయన్స్, అంతర్జాతీయ బిగ్ క్యాట్ అలయన్స్ వంటి వినూత్న వేదికల ఏర్పాటును ఆయన గుర్తుచేశారు. "ప్రపంచంతో ముందుకు సాగుతూ పర్యావరణ పరిరక్షణలో మేం నూతన ప్రమాణాలను నెలకొల్పుతున్నాం" అని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు.

పురాతన తత్వశాస్త్రాన్ని ఆధునిక ఆచరణతో అనుసంధానిస్తూ, గత పన్నెండేళ్లలో పర్యావరణ రంగంలో సాధించిన ప్రతీ అసాధారణ పురోగతిని ప్రధానమంత్రి వివరించారు. ముఖ్యంగా పునరుత్పాదక ఇంధన వనరుల దిశగా వ్యూహాత్మక మలుపు తీసుకోవడాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. కాప్-21 నిబద్ధతలను షెడ్యూల్ కంటే ముందుగానే సాధించటం ద్వారా శిలాజ ఇంధనేతర, సౌర విద్యుత్ సామర్థ్యాల్లో ప్రపంచ ప్రమాణాలను నెలకొల్పి జీ-20 దేశాల్లో భారత్ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు. "ప్రతి అంశంలోనూ భారత్ కనబరుస్తున్న ప్రతిభ నేడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారుతోంది" అని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు.

దేశంలో జరిగిన సౌర విప్లవానికి స్పష్టమైన సాక్ష్యాల గురించి చెబుతూ... పన్నెండేళ్ల కిందట కేవలం 2 గిగావాట్లుగా ఉన్న సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం నేడు 160 గిగావాట్లకు పైగా పెరిగిందని ప్రధానమంత్రి తెలిపారు. ప్రతి ఇంటికి రూ. 80,000 వరకు ఆర్థిక సహాయం అందిస్తున్న పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ద్వారా 50 లక్షలకు పైగా ఇళ్లకు సౌర విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కుసుమ్ యోజన ద్వారా 30 లక్షల మంది రైతులకు సోలార్ పంపులను అందజేసినట్లు చెప్పారు. ఒక దేశం - ఒక గ్రిడ్ ప్రాజెక్టును పూర్తి చేయటం ద్వారా 20 కోట్ల టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గించినట్లు తెలిపారు. "ఇళ్లను సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలుగా మార్చేందుకు మేం ఒక మిషన్‌ను ప్రారంభించాం" అని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు.

స్వచ్ఛ ఇంధన రంగంలోని అసాధారణ పురోగతిని వివరిస్తూ... పవన విద్యుత్ సామర్థ్యం మూడు రెట్లు పెరిగిందని, జల విద్యుత్ ప్రాజెక్టులు గణనీయంగా విస్తరించాయని, నూతనంగా ప్రైవేటు రంగానికి కూడా అవకాశం కల్పిస్తూ అణు విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించామని చెప్పారు. కోల్ గ్యాసిఫికేషన్ వంటి పరిశుద్ధ సాంకేతికతలను ముందుకు తీసుకువెళ్తూ... ఈ ఉమ్మడి ప్రయత్నాలన్నీ దేశంలోని శిలాజేతర ఇంధన సామర్థ్యాన్ని దాదాపు నాలుగు రెట్లు పెంచినట్లు తెలిపారు. "స్వచ్ఛ ఇంధన రంగానికి సంబంధించి ఇతర రంగాల్లోనూ భారత్ కీలక విజయాలను సాధించింది" అని శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

అధునాతన పర్యావరణహిత రవాణా శకానికి నాంది పలుకుతూ... ఇటీవల దేశంలో తొలి హైడ్రోజన్ రైలును ప్రారంభించినట్లు ప్రధానమంత్రి తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత పొడవైన రైలుగా ఇది చరిత్ర సృష్టించినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో పర్యావరణహిత రవాణాకు ఇది కీలక ఆధారమని అభివర్ణించారు. "పర్యావరణహిత రవాణా రంగంలో ఇది కొత్త శకానికి నాంది" అని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు.

పర్యావరణ హిత వాహనాల వినియోగం పెరుగుతున్న క్రమాన్ని ప్రధానమంత్రి వివరించారు. ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలు 950 రెట్లు పెరిగాయని శ్రీ మోదీ తెలిపారు. 2014కు ముందు 3,000 లోపుగా ఉన్న ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలు గత ఏడాది సుమారు 25 లక్షలకు చేరుకున్నాయని పేర్కొన్నారు. రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపై ఆధునిక ఫాస్టాగ్ వ్యవస్థ టోల్ బూత్‌ల వద్ద వేచి ఉండే సమయాన్ని గణనీయంగా తగ్గించడం ద్వారా ఇంధన వృథాను కూడా భారీగా తగ్గించిందని ఆయన తెలిపారు. "ఎలక్ట్రిక్ వాహనాల విప్లవం అందిస్తున్న ఈ అవకాశాన్ని భారత్ పూర్తి స్థాయిలో అందిపుచ్చుకుంటోంది" అని శ్రీ మోదీ అన్నారు.

ప్రజా రవాణా మౌలిక సదుపాయాల్లో చోటుచేసుకున్న విస్తృత ఆధునీకరణను ప్రస్తావిస్తూ.. 2014లో కేవలం అయిదు నగరాల్లో 250 కిలోమీటర్ల మేర ఉన్న మెట్రో రైలు వ్యవస్థతో పోలిస్తే, ప్రస్తుతం 20కి పైగా నగరాల్లో మెట్రో సేవలు విస్తరించాయని ప్రధానమంత్రి వివరించారు. "వెయ్యి కిలోమీటర్లకు పైగా మెట్రో వ్యవస్థ కలిగిన ప్రపంచ దేశాల సరసన భారత్ చేరింది" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

భారీ సరకు రవాణాలో చోటుచేసుకుంటున్న పర్యావరణహిత మార్పును ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వివరించారు. రైల్వే మార్గాల్లో దాదాపుగా సంపూర్ణ విద్యుదీకరణ జరిగిన కారణంగా కోట్లాది లీటర్ల డీజిల్ వాడకం ఆదా అవుతోందని తెలిపారు. ఇటీవల ప్రారంభించిన 3,000 కిలోమీటర్ల ప్రత్యేక సరుకు రవాణా కారిడార్ వల్ల కలుగుతున్న భారీ పర్యావరణ ప్రయోజనాలను ఆయన వివరించారు. ఈ కారిడార్‌లో చారిత్రకంగా తొలిసారిగా డబుల్ స్టాక్ కంటైనర్ రైళ్లు ఒక ప్రయాణంలో వందలాది కాలుష్యకారక ట్రక్కుల స్థానాన్ని భర్తీ చేస్తున్నాయని పేర్కొన్నారు. "ఇది పర్యావరణానికి ఎంత భారీగా మేలు చేస్తుందో మీరు ఊహించవచ్చు" అని శ్రీ మోదీ అన్నారు.

పర్యావరణహిత ప్రత్యామ్నాయ రవాణా మార్గాలను ప్రస్తావిస్తూ... దేశవ్యాప్తంగా సుమారు 5,000 కిలోమీటర్ల అంతర్గత జలమార్గాలు అందుబాటులోకి వచ్చి కార్యకలాపాలు ప్రారంభించడం పట్ల ప్రధాన మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఈ జలమార్గాల్లో ఒక ప్రామాణిక అంతర్గత జలరవాణా నౌక డజన్ల కొద్దీ ట్రక్కులు మోసే సరుకుకు సమానమైన సరుకును రవాణా చేయగలదని ఆయన వివరించారు. "ఇది కూడా పర్యావరణ పరిరక్షణకు ఎంతో దోహదపడుతోంది" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

రవాణా రంగంలో చోటు చేసుకున్న ఈ అన్ని మార్పుల సమష్టి ప్రభావాన్ని వివరిస్తూ... రవాణా రంగం మొత్తంలో వచ్చిన విస్తృత మార్పులు దేశం సమతుల్య అభివృద్ధి పథంలో పయనిస్తోందనడానికి తిరుగులేని నిదర్శనమని ప్రధానమంత్రి అన్నారు. వేగవంతమైన అభివృద్ధి పర్యావరణ పరిరక్షణకు పూర్తిగా అనుగుణంగా సాగవచ్చని ఆయన పేర్కొన్నారు. "మన అభివృద్ధి వేగవంతమైనదే కాకుండా సుస్థిరమైనది కూడా" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

జల సంరక్షణలో అపూర్వమైన ప్రజల భాగస్వామ్యాన్ని ప్రశంసిస్తూ... 'క్యాచ్ ది రెయిన్' కార్యక్రమం కింద 70,000కు పైగా అమృత్ సరోవర్లు, 1.5 కోట్ల వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలు ఏర్పాటు చేయడాన్ని ప్రధానమంత్రి ప్రస్తావించారు. ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన, 'పర్ డ్రాప్, మోర్ క్రాప్' (ప్రతి బొట్టుకు, అధిక పంట) కింద ఆధునిక సాగునీటి పద్ధతులు 2 కోట్లకు పైగా రైతులకు నీటిని ఆదా చేయడంలో చురుకుగా దోహదపడుతున్నాయని ఆయన తెలిపారు. "భారత్‌లో నీటి సంరక్షణపై అపూర్వమైన స్థాయిలో పని జరుగుతోంది" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

ప్రపంచవ్యాప్తంగా చిరుధాన్యాల పునరుజ్జీవనాన్ని ప్రోత్సహిస్తూ, తక్కువ నీటితో సాగు చేయగల శ్రీ అన్నా రకం పంటల సాగును ప్రోత్సహించడం ద్వారా దేశీయ ఉత్పత్తి పెరగడంతో పాటు ఎగుమతులు 1.5 లక్షల టన్నులకు చేరుకున్నాయని ప్రధానమంత్రి వివరించారు. అదే సమయంలో ఇది ఆర్థిక అవకాశాలను సృష్టించడంతో పాటు నీటి సంరక్షణకు కూడా దోహదపడిందని తెలిపారు. ఈ నిరంతర జాతీయ ప్రయత్నాలే 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రపంచవ్యాప్తంగా నిర్వహించేందుకు స్ఫూర్తి నిచ్చాయని ఆయన పేర్కొన్నారు. "ఈ నమూనా కారణంగానే ప్రపంచం కూడా మనతో కలిసి ముందుకు వస్తోంది" అని శ్రీ మోదీ అన్నారు.

పర్యావరణహిత వ్యవసాయం విస్తరిస్తున్న భారీ స్థాయిని ప్రస్తావిస్తూ... జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ కింద 12.5 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో 24,000 ప్రకృతి వ్యవసాయ క్లస్టర్లను ఏర్పాటు చేసినట్లు ప్రధానమంత్రి వివరించారు. వాతావరణ మార్పులను తట్టుకునే 3,000 పంట రకాల అభివృద్ధిని విజయవంతంగా చేపట్టడంతో పాటు, దేశ కార్బన్ పాదముద్రను తగ్గించేందుకు వ్యవసాయ-అటవీకరణను వ్యూహాత్మకంగా ప్రోత్సహిస్తున్నామని ఆయన తెలిపారు. "వ్యవసాయ-అటవీకరణను ప్రోత్సహించడం ద్వారా మనం కార్బన్ పాదముద్రను కూడా తగ్గిస్తున్నాం" అని శ్రీ మోదీ అన్నారు.

దేశ పర్యావరణ పరిరక్షణ చర్యలు సమగ్రంగా కొనసాగుతున్న తీరును వివరించారు. గత 12 ఏళ్లలో అత్యంత దట్టమైన అటవీ విస్తీర్ణం 22 శాతానికి పైగా పెరిగిందని ప్రధానమంత్రి తెలిపారు. దేశవ్యాప్తంగా నిరంతరంగా కోట్లాది మొక్కలను నాటేలా ప్రజలను ప్రేరేపిస్తున్న 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమాన్ని ఆయన ప్రశంసించారు.

ప్లాస్టిక్ కాలుష్యం వంటి కీలక సవాలును ప్రస్తావిస్తూ... సింగిల్-యూజ్ ప్లాస్టిక్‌పై దేశవ్యాప్తంగా ఉన్న నిషేధాన్ని ప్రధాన మంత్రి మరోసారి గుర్తుచేశారు. ప్రతిరోజూ ఉత్పత్తి అయ్యే వేల టన్నుల వ్యర్థాలను తగ్గించడం, తిరిగి వినియోగించడం, రీసైకిల్ చేయడం ద్వారా సర్క్యులర్ ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. వ్యర్థాలను సంపదగా మార్చే విధానానికి గోవర్ధన్ యోజన ఒక చక్కటి ఉదాహరణ అని, గ్రామీణ ప్రాంతాల్లోని సేంద్రియ వ్యర్థాలను విలువైన వనరులుగా మార్చేందుకు ఈ పథకం దోహదపడుతోందని పేర్కొన్నారు. "వ్యర్థాలను సమస్యగా చూడకుండా, వాటిని వనరులుగా మార్చాలన్నదే మా ప్రయత్నం" అని శ్రీ మోదీ అన్నారు.

దేశ పర్యావరణ పరిరక్షణలో సాధించిన విజయాల ప్రాధాన్యతను వివరించారు. ఈ గణాంకాలు కేవలం దేశీయ పురోగతిని మాత్రమే సూచించవని ప్రధాన మంత్రి అన్నారు. దేశ అభివృద్ధికి సంబంధించిన ఈ గణాంకాలు మొత్తం మానవాళి మనుగడ, శ్రేయస్సు కోసం భారత్ చేస్తున్న కీలక, ప్రత్యక్ష కృషిని ప్రతిబింబిస్తున్నాయని తెలిపారు. "ఇవి మానవాళి భవిష్యత్తుకు భారత్ అందిస్తున్న సహకారానికి సంబంధించిన గణాంకాలు కూడా" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

ఈ బాధ్యతాయుతమైన చర్యలకు స్ఫూర్తినిస్తున్న భూమి, దానిపై నివసించే ప్రజల మధ్య ఉన్న గాఢమైన సంబంధాన్ని ప్రధానమంత్రి ప్రస్తావించారు. ఆశావహ దృక్పథంతో తన ప్రసంగాన్ని ముగిస్తూ... సదస్సులో జరిగే చర్చల ద్వారా వినూత్న పరిష్కారాలు వెలువడతాయన్న పూర్తి విశ్వాసాన్ని వ్యక్తం చేసి, తన శుభాకాంక్షలు తెలిపారు. "బాధ్యతాయుతమైన, సుస్థిరమైన భవిష్యత్తును నిర్మించేందుకు భారత్ కూడా కృషి చేస్తోంది" అని శ్రీ మోదీ అన్నారు

## కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో భారత నావికాదళ తొలి అత్యాధునిక క్షిపణి నౌక (ఎన్‌జీఎంవీ) నిర్మాణం ప్రారంభం

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 21:భారత నౌకాదళానికి చెందిన తొలి 'నెక్స్ట్ జనరేషన్ క్షిపణి నౌక' (ఎన్‌జీఎంవీ) నిర్మాణ పనులు కొచ్చిలోని కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో ఈ నెల 18న అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి నౌకాదళ ఉత్పత్తి, కొనుగోలు విభాగ నియంత్రణాధికారి వైస్ అడ్మిరల్ సంజయ్ సాధు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వేడుకలో భారత నౌకాదళం, కొచ్చిన్ షిప్‌యార్డ్‌కు చెందిన పలువురు ఉన్నతాధికారులూ పాల్గొన్నారు.

మార్చి-2023లో ఎన్‌జీఎంవీల నిర్మాణానికి సంబంధించి సీఎస్ఎల్‌తో ఒప్పందం కుదిరింది. అత్యాధునిక ఆయుధాలు, సెన్సార్లతో వీటిని నిర్మించాలని ప్రణాళిక రూపొందించారు. ఇవి భారత నౌకాదళాన్ని 'భవిష్యత్తుకు సిద్ధమైన, యుద్ధానికి సంసిద్ధంగా ఉన్న దళం' గా మెరుగుపరుస్తూ, సైన్యం పోరాట సామర్థ్యాలనూ గణనీయంగా పెంపొందిస్తాయి.

ఈ క్షిపణి నౌకల నిర్మాణం... హిందూ మహాసముద్ర ప్రాంతంలోని సవాలుతో కూడిన పరిస్థితులను ఎదుర్కోవడం కోసం ఒక బలమైన, ఆధునికమైన నౌకాదళాన్ని నిర్మించడం పట్ల భారత్ నిబద్ధతను మరింత బలపరుస్తుంది.

ఈ ప్రాజెక్ట్ భారత రక్షణ రంగ సొంత తయారీ సామర్థ్యాలనూ చాటుతోంది. ఈ నౌకల్లో వాడే ప్రధానమైన, కీలకమైన రక్షణ పరికరాలన్నింటినీ భారత్‌లోనే సొంతంగా అభివృద్ధి చేసి, తయారు చేస్తున్నారు. ఇది భారత ప్రభుత్వ 'స్వయం-సమృద్ధ భారత్', 'మేక్ ఇన్ ఇండియా - మేక్ ఫర్ ది వరల్డ్' దార్శనికతలకు అనుగుణంగా ఉంది.

## కర్ణాటకలోని హుబ్బళ్లిలో మెడికల్ రీసెర్చ్ సెంటర్ ప్రాంగణాన్ని సందర్శించిన కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 21: కర్ణాటకలోని హుబ్బళ్లిలో జేబీజీ ఎంఎం మెడికల్ కాలేజ్, కేఎల్‌ఈ హాస్పిటల్ అండ్ మెడికల్ రీసెర్చ్ సెంటర్ ప్రాంగణాన్ని కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా ఈ రోజు సందర్శించారు."కర్ణాటకలోని హుబ్బళ్లిలో ఉన్న జేబీజీఎంఎం మెడికల్ కాలేజ్, కేఎల్‌ఈ హాస్పిటల్ అండ్ మెడికల్ రీసెర్చ్ సెంటర్ ప్రాంగణాన్ని ఈ రోజు సందర్శించాను. విద్య, వైద్య సేవల ద్వారా కేఎల్‌ఈ సంస్థ 110 ఏళ్లకు పైగా దేశానికి సేవలందిస్తోంది. 250 ఎంబీబీఎస్ సీట్లు, 1,200 పడకలతో ఏర్పాటు చేసిన ఈ కొత్త సదుపాయంలో 300 పడకలను పేదల కోసం కేటాయించారు.

కర్ణాటక అంతటా ప్రపంచస్థాయి వైద్య సేవలను విస్తరించడంలో ఇది మరో కీలక మైలురాయిగా నిలిచింది" అని శ్రీ అమిత్ షా సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' లో పేర్కొన్నారు.

సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో దాదాపు రూ.700 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ మెడికల్ కాలేజ్, ఆసుపత్రి సముదాయంలో మొత్తం 20 లక్షల చదరపు అడుగుల కట్టుబడి విస్తీర్ణం ఉంది. ఈ ఆసుపత్రిలో ఒకే చోట విస్తృత స్థాయిలో వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్స్, పల్మనాలజీ, ప్రసూతి, స్త్రీ వ్యాధులు, నేత్ర వైద్యం, చెవి - ముక్కు - గొంతు వైద్యం (ఈఎన్‌టీ), మానసిక వైద్యం, దంత వైద్యం, ఫిజియోథెరపీ మొదలైన ప్రాథమిక ప్రత్యేక వైద్య విభాగాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. కార్డియాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, గ్యాస్ట్రోఎంటరాలజీ, నెఫ్రాలజీ, అవయవ మార్పిడి, యూరాలజీ, ఆంకాలజీ, ఎండోక్రైనాలజీ వంటి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలతో పాటు ఆధునిక ప్రయోగశాల సదుపాయాలు కూడా ఇక్కడ అందుబాటులో ఉన్నాయి.

# భీమేశ్వర ఆలయంలో భక్తుల సందడి

### 40 వేల మంది భక్తుల దర్శనం.. రూ.20 లక్షల ఆదాయం

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 21:(నేటినిజం ప్రతినిధి): సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తుల సందడి నెలకొంది. స్వామివారికి ప్రీతిపాత్రమైన సోమవారం కావడంతో తెలంగాణలోని వివిధ జిల్లాల తోపాటు పక్క రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు రాజన్న క్షేత్రానికి తరలివచ్చారు. తెల్లవారుజామున పవిత్ర స్నానాలు ఆచరించిన భక్తులు స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరారు.

గర్భగుడిలో కొలువుదీరిన స్వామివారిని దర్శించుకున్న భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, ఆలయ ఖజానాకు రూ.20 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ వర్గాలు వెల్లడించాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ రమాదేవి తెలిపారు. దర్శనం, క్యూలైన్లు, భక్తుల సౌకర్యాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని పేర్కొన్నారు.

# షోరూమ్‌లో అగ్ని ప్రమాదం.. నాలుగు వాహనాలు దగ్ధం

ఖమ్మం, సెప్టెంబర్ 21: సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డులోని టీచర్స్ కాలనీలో ఉన్న హెచ్‌ఆర్‌ఈవీ మోటార్స్ షోరూమ్‌లో సోమవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు సమాచారం. ప్రమాదంలో షోరూమ్‌లో ఉన్న నాలుగు ఈవీ మోటార్ బైకులు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో సుమారు రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. షోరూమ్ నుంచి మంటలు, పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సకాలంలో అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దీంతో మంటలు మరింత వ్యాపించకుండా నివారించగలిగారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు.

# విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్నాం..

### సర్కారు బడుల్లో పౌష్టిక అల్పాహారం -రాష్ట్ర ప్రభుత్వ విప్ విజయరమణ

కరీంనగర్, సెప్టెంబర్ 21:విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నవిద్యార్థులు




పౌష్టికాహారంతోపాటు నాణ్యమైన విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అల్పాహార కార్యక్రమాన్ని చేపట్టిందని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు. సోమవారం పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో హరే రామ కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అల్పాహార కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులు ఉదయాన్నే వ్యవసాయ, ఇతర పనులకు వెళ్లిపోతుండటంతో పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ఉదయపు అల్పాహారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. వారానికి ఆరు రోజుల పాటు ఇడ్లీ.. సాంబార్, పూరీ.. ఆలూ కుర్మా, దోస, ఉప్మా, మిల్లెట్ ఇడ్లీ.. సాంబార్, బోండా తదితర అల్పాహారంతోపాటు పాలు అందిస్తున్నట్లు వివరించారు. అలాగే, పెద్దపల్లి నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఇప్పటివరకు రూ.65 కోట్లు ఖర్చు చేసినట్లు విజయరమణ రావు తెలిపారు. రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, ఇప్పటికే పిల్లర్ల నిర్మాణం పూర్తయిందని తెలిపారు. ఏడాదిలో పనులు పూర్తి చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల హాస్టళ్లను ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ వనజ, ఎంపీడీఓ అనిల్ రెడ్డి, సర్పంచ్ కనికిరెడ్డి నతీష్, మండల విద్యాధికారి రమేశ్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శిరీష, సింగిల్ విండో చైర్మన్ సుమన్ రెడ్డి, మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పోషణ మాసంపై తల్లులకు అవగాహన..

### చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి.. సమతుల ఆహారంతోనే సంపూర్ణ ఎదుగుదల..

కరీంనగర్, సెప్టెంబర్ 21: పోషణ మాసం సందర్భంగా మెట్‌వల్లి మండలంలోని బండలింగాపూర్ గ్రామపంచాయతీ




కార్యాలయంలో సోమవారం అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో చిన్నారుల తల్లులకు పౌష్టికాహారం, దాని ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారం ఎంతో కీలకమని ఈ సందర్భంగా వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, అందులోని పోషక విలువలు, పిల్లల వయస్సుకు అనుగుణంగా అందించాల్సిన సమతుల ఆహారం తదితర అంశాలపై తల్లులకు అవగాహన కల్పించారు. పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు ఇంటి వద్ద కూడా పోషక విలువలున్న ఆహారాన్ని అందించాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య శాఖ సిబ్బంది అందించే సూచనలను పాటిస్తూ పిల్లల ఎదుగుదలపై నిరంతరం దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కనగందుల లక్ష్మీ సంజీవ్, ఉపసర్పంచ్ ఆకుల రాకేష్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, ఆరోగ్య శాఖ, ఆయుర్వేద శాఖ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు. పోషకాహారంపై తల్లులకు అవగాహన పెంచడంతో పాటు.. చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు గ్రామస్థాయిలో ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని కార్యక్రమంలో పేర్కొన్నారు.

# మానిటైజేషన్ కార్యక్రమం పురోగతిని సమీక్షించిన ఎన్ఎల్ఎంసీ 21వ బోర్డు సమావేశం ... వేగవంతమైన ఆస్తుల మానిటైజేషన్‌కు ప్రాధాన్యత

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 21:నేషనల్ ల్యాండ్ మానిటైజేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్ఎలఎంసీ) బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల 21వ సమావేశం సెప్టెంబర్ 18, 2026న జరిగింది. కార్పొరేషన్‌లో కొనసాగుతున్న ఆస్తుల మానిటైజేషన్ కార్యక్రమ ఆర్థిక పనితీరు, కీలక సంస్థాగత కార్యక్రమాలపై ఈ సమావేశంలో సమీక్షించారు.

సమావేశంలో రూ.5000 కోట్లకు పైగా విలువైన ఆస్తుల మానిటైజేషన్ ప్రతిపాదనల పరిశీలన, సిఫార్సులు జరిగాయి. మానిటైజేషన్ కోసం గుర్తించిన మిగులు భూమి, భవన ఆస్తులు ఈ ప్రతిపాదనల్లో ఉన్నాయి. తక్కువగా వినియోగిస్తున్న, మిగులు ఆస్తుల విలువను వెలికితీయాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లటంలో ఇది కీలక ముందడుగును సూచిస్తుంది.

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు (సీపీఎస్ఈలు), ఇతర ప్రభుత్వ సంస్థలకు చెందిన మిగులు ఆస్తుల మానిటైజేషన్‌ను వేగవంతం చేయటంలో ఎన్ఎల్ఎంసీ సాధించిన పురోగతిని బోర్డు సమీక్షించింది. పారదర్శకత, సమర్థత, గరిష్ఠ విలువను సాధించటంపై ప్రత్యేక దృష్టి సారించి, తగిన ఆస్తులను గుర్తించటం, అవసరమైన పరిశీలన చేయటం, విలువను అంచనా వేయటంలో సహాయపడటం, తగిన మానిటైజేషన్ విధానాలను రూపొందించటం కోసం కార్పొరేషన్ ఆస్తులు గల సంస్థలతో కలిసి పనిచేస్తోంది.

వివిధ ఆస్తుల యాజమాన్య సంస్థల పరిధిలో కొనసాగుతున్న ప్రయత్నాలతో సహా ఎన్ఎల్ఎంసీ చేపట్టిన ఆస్తుల మానిటైజేషన్ వేగం, పురోగతిని బోర్డుకు వివరించారు. మానిటైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయటం, అమలుకు సంబంధించిన అవసరాలను పరిష్కరించటం, గుర్తించిన ఆస్తులను సరైన, పారదర్శక విధానాల ద్వారా ముందుకు తీసుకెళ్లటంపై ఈ చర్చలు జరిగాయి.

పురోగతిని అభినందించటంతో పాటు మిగులు ఆస్తుల విక్రయాన్ని సకాలంలో పూర్తి చేసేందుకు వేగాన్ని కొనసాగించటం, భాగస్వామ్య సంస్థలతో సమన్వయాన్ని బలోపేతం చేయాల్సిన ప్రాముఖ్యతను బోర్డు స్పష్టం చేసింది.

2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎన్ఎల్ఎంసీ వార్షిక ఆర్థిక నివేదికలను, డైరెక్టర్ల నివేదికను బోర్డు ఆమోదించింది.

[illegible] పెంపొందించుకోవటానికి, ఆస్తుల కోసం మరింత వ్యవస్థీకృత వ్యవస్థను రూపొందించటానికి, కొనసాగుతున్న ఎన్ఎల్ఎంసీ కార్యక్రమాలను సమీక్షించటానికి ఈ సమావేశం అవకాశాన్ని కల్పించింది. రూ. 5,000 కోట్లకు పైగా విలువైన ఆస్తులకు సంబంధించి బోర్డు సిఫార్సులు చేయటం వల్ల ప్రభుత్వ ఆస్తుల మానిటైజేషన్ కార్యక్రమంలో ఎన్ఎల్ఎంసీ పాత్ర పెరుగుతోందని స్పష్టమవుతోంది.

# ప్రభుత్వ పథకాల కారణంగా 6 శాతం నుంచి 3.2 శాతానికి తగ్గిన నిరుద్యోగిత రేటు: కేంద్ర మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 21:దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో నిర్వహించిన 20వ 'రోజ్‌గార్ మేళా'లో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వీడియో అనుసంధానం ద్వారా పాల్గొన్నారు. కొత్తగా ఉద్యోగాలు పొందిన 51,000 మందికి పైగా యువతకు నియామక పత్రాలను అందజేశారు.

చెన్నైలోని డి.జి. వైష్ణవ్ కళాశాలలో జరిగిన రోజ్‌గార్ మేళాలో కేంద్ర సమాచార, ప్రసార, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ పలు మంత్రిత్వ శాఖలు, విభాగాలు, సంస్థలకు ఎంపికైన 285 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఆదాయపు పన్ను శాఖ, ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, రక్షణ మంత్రిత్వ శాఖ, తపాలా శాఖ, జవహర్‌లాల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (జిప్‌మర్), సదరన్ రైల్వే వంటి కీలక సంస్థల్లో చేరుతున్న యువతకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

కేంద్ర మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ మాట్లాడుతూ... కొత్తగా ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరుతున్న యువతపై 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చే పెద్ద బాధ్యత ఉందన్నారు. ఈ ఉద్యోగాన్ని కేవలం ఒక బతుకు దెరువులా చూడకుండా, దేశ సేవకు దక్కిన అవకాశంగా భావించి దేశ ప్రగతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఉద్యోగ నియామక పత్రం అంటే కేవలం ఉద్యోగం రావడం కాదు, దేశ సేవకు దక్కిన అవకాశం అని ఆయన అన్నారు. కార్యాలయాల్లో ప్రజలను కలిసినప్పుడు ప్రభుత్వ ఉద్యోగులే ప్రభుత్వానికి గుర్తింపుగా నిలుస్తారని పేర్కొన్నారు. అందుకే ప్రజలతో మాట్లాడేటప్పుడు నిజాయతీ, బాధ్యత, సానుభూతి, మానవత్వంతో నడుచుకోవడం చాలా ముఖ్యమని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

ప్రభుత్వం ప్రవేశపెట్టిన మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా, ముద్రా లోన్స్ వంటి పథకాల వల్ల యువత ఉద్యోగాల కోసం ఎదురుచూసే పరిస్థితి నుంచి ఇతరులకు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదిగారని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఈ రకమైన ప్రభుత్వ ప్రయత్నాల వల్లే దేశంలో నిరుద్యోగం 6 శాతం నుంచి 3.2 శాతానికి తగ్గిందని ఆయన వెల్లడించారు.

2014 నాటికి మన దేశంలో కేవలం 400 అంకురసంస్థలు మాత్రమే ఉండేవనీ, ఇప్పుడు వాటి సంఖ్య 2.5 లక్షలు దాటిందని కేంద్ర మంత్రి తెలిపారు. ముఖ్యంగా గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఈ అంకురసంస్థలు స్థాపించిన వారిలో ఎక్కువ మంది 30 ఏళ్ల లోపు వయసున్న యువతేనని ఆయన వివరించారు.

నిరంతర అభ్యసనం, సరికొత్త సాంకేతికతలను అలవర్చుకోవడం, వృత్తిపరమైన నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాల్సిన ప్రాముఖ్యతను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. అంతరిక్ష సాంకేతికత, అణుశక్తి వంటి అత్యాధునిక రంగాల్లో యువతకు పెరుగుతున్న అవకాశాలనూ ఆయన ప్రస్తావించారు. అంతరిక్షం, రక్షణ, విద్య, పరిపాలన, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ సహా అన్ని రంగాల్లో మహిళల భాగస్వామ్యం వేగంగా పెరుగుతోందని కేంద్ర మంత్రి గుర్తుచేశారు.

యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఎంత ప్రాధాన్యమిస్తుందో చెప్పడానికి ఇదే నిదర్శనమన్నారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా నిర్వహించిన రోజ్‌గార్ మేళాల ద్వారా 12.75 లక్షల మందికి పైగా ఉద్యోగ నియామక పత్రాలను అందించినట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

అనంతరం మీడియాతో కేంద్ర మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ మాట్లాడుతూ.. తమిళనాడులో నవోదయ పాఠశాలలు ఏర్పాటు చేయడం వల్ల పేద, ఆర్థికంగా వెనకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులకూ నాణ్యమైన విద్య అందుతుందని అన్నారు. ఇది మాతృభాషలో ప్రాథమిక విద్యను సులభతరం చేయడంతో పాటు, విద్యార్థులు పలు భారతీయ భాషలను నేర్చుకునేందుకు గొప్ప అవకాశాలను కల్పిస్తుందని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమానికి తమిళనాడు, పుదుచ్చేరి ఆదాయపు పన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ శ్రీ సునీల్ బాజ్‌పాయ్, ఇతర ఉన్నతాధికారులు, కొత్తగా నియమితులైన ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

# ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ కాపీలు అందజేత

నిజామాబాద్, సెప్టెంబర్ 21: నిజామాబాద్ జిల్లా, బాల్కొండ నియోజకవర్గంలోని భీమ్‌గల్ మండలం కారేపల్లి గ్రామంలో రెండో విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన ప్రొసీడింగ్ కాపీలను సోమవారం లబ్ధిదారులకు అందజేశారు.

గ్రామ సర్పంచ్ మోతిలాల్, గ్రామ శాఖ అధ్యక్షుడు ఆకాష్, పాలకవర్గ సభ్యులు కలిసి లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా మోతిలాల్ మాట్లాడుతూ.. అర్హులైన పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రొసీడింగ్ కాపీలు అందుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ అజయ్,ఉప సర్పంచ్ సుజాత రాజేష్, బాబులాల్ నాయక్,గోవింద్, ప్రేమ్ కుమార్,వెంకటేష్, సంతోష్, చందర్ పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో 20వ రోజ్‌గార్ మేళా కార్యక్రమాన్ని ప్రారంభించిన కేంద్ర హోం వ్యవహారాల సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్



న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 21:హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ ఇనిస్టిట్యూట్‌లో 20వ రోజ్‌గార్ మేళాను కేంద్ర హోం వ్యవహారాల సహాయమంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ ప్రారంభించారు. హైదరాబాద్ జోన్, సెంట్రల్ టాక్స్, కస్టమ్స్ విభాగం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ రోజ్‌గార్ మేళాలో 221 మంది అభ్యర్థులు నియామక పత్రాలు అందుకున్నారు.

ఈ సందర్భంగా శ్రీ బండి సంజయ్ కుమార్ మాట్లాడారు. దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో నిర్వహించిన 20వ రోజ్‌గార్ మేళాలో మొత్తం 51,000 నియామక పత్రాలను అందజేసినట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 10 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాలన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నిబద్ధతను ఈ కార్యక్రమం తెలియజేస్తుందన్నారు.

దేశవ్యాప్తంగా ఇప్పటివరకు జరిగిన 19 రోజ్‌గార్ మేళా కార్యక్రమాల్లో మొత్తం 12.75 లక్షల నియామక పత్రాలను అందించినట్లు శ్రీ బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు.

2047 నాటికి వికసిత్ భారత్ సాధించాలన్న సంకల్పం దిశగా ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు కేంద్ర హోం వ్యవహారాల సహాయమంత్రి తెలిపారు.

2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధన పట్ల ప్రభుత్వానికున్న నిబద్ధతను తెలియజేస్తూ... యువతకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు, వారికి మద్దతిచ్చేందుకు స్టార్టప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, సంక్షేమ పథకాలు, ఎన్నో ఇతర కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టినట్లు తెలిపారు.

కొత్తగా నియమితులైన అభ్యర్థులను శ్రీ బండి సంజయ్ కుమార్ అభినందించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సాధించటం... ఎంతోమంది అభ్యర్థులు, వారి కుటుంబాలకు కీలక ఘట్టమన్నారు. అంకితభావంతో పనిచేస్తూ దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని వారిని ప్రోత్సహించారు.

సభకు హాజరైన వారికి హైదరాబాద్ జోన్ సెంట్రల్ టాక్స్, కస్టమ్స్ చీఫ్ కమిషనర్, ఐఆర్ఎస్ శ్రీ అరుణ్ కుమార్ స్వాగతం పలికారు. నూతన ఉద్యోగుల రాక ప్రభుత్వ సేవలకు సంబంధించి కొత్త ఆలోచనలు, ఉత్సాహాన్ని తీసుకొస్తుందన్నారు. హైదరాబాద్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ నార్కోటిక్స్ (ఎన్ఏసీఐఎన్)లో నూతనంగా నియమితులైన 221 మంది అభ్యర్థులు శిక్షణ పొందుతారని తెలిపారు. జీఎస్టీ, కస్టమ్స్, సంబంధిత చట్టాలు, కార్యాలయ విధానాలు, ప్రయోగాత్మకంగా పనితీరు గురించి శిక్షణ ఉంటుంది. తెలంగాణ పోలీసు అకాడమీ సహకారంతో ఇన్‌స్పెక్టర్లకు ప్రత్యేక ఆయుధ నైపుణ్య శిక్షణను కూడా అందిస్తారు. నూతనంగా నియమితులైన ఉద్యోగులు నిబద్ధతతో, అంకితభావంతో విధులను నిర్వర్తించాలని... "పౌరుడు, పన్ను చెల్లింపుదారుడు, దేశం తొలి ప్రాధాన్యత" సూత్రాన్ని పాటించాలని శ్రీ అరుణ్ కుమార్ పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో వారు చేసే పని ప్రభుత్వ విధానాల కచ్చితమైన అమలుకు, 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ లక్ష్య సాధనకు తోడ్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జీఎస్టీ కమిషనరేట్ ప్రిన్సిపల్ కమిషనర్ ఐఆర్ఎస్ శ్రీ ఎన్.జే. కుమరేష్, ఉన్నతాధికారులు, నూతనంగా నియమితులైన అభ్యర్థుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# వికసిత భారత్ 2047 లక్ష్య సాధనలో యువత కీలకపాత్ర పోషించాలి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి




హైదరాబాద్, సెప్టెంబర్ 21:2047 నాటికి భారతదేశాన్ని వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దాలన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ లక్ష్య సాధనలో యువత కీలకపాత్ర పోషించాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఆదాయ పన్ను శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రోజ్‌గార్ మేళాను శనివారం ఆయన ప్రారంభించారు. కొత్తగా వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికైన 360 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు.

దేశవ్యాప్తంగా 51,000 మందికి పైగా అభ్యర్థులకు ఉద్యోగ నియామకపత్రాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 45 ప్రాంతాల్లో శనివారం 20వ విడత రోజ్‌గార్ మేళాను నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు.

హైదరాబాద్‌లో నిర్వహించిన రోజ్‌గార్ మేళాను ప్రారంభించిన అనంతరం శ్రీ కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... 20 విడతల్లో రోజ్‌గార్ మేళాల ద్వారా కేంద్రప్రభుత్వం దాదాపు 13 లక్షల మంది దేశ యువతకు ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు కల్పించిందని పేర్కొన్నారు. ఒకవైపు ప్రభుత్వ ఉద్యోగాలను కల్పిస్తూనే మరోవైపు ఇతర రంగాల్లోనూ ఉద్యోగాల సృష్టిని కేంద్రం ప్రోత్సహిస్తోందని అన్నారు. ఈ దిశగానే ప్రస్తుతం పెట్టుబడులకు భారత్ గమ్యస్థానంగా మారిందని, ప్రపంచంలోనే ఎక్కువ స్టార్టప్‌లు కలిగిన దేశాల్లో ముందంజలో ఉందని ప్రధానంగా ప్రస్తావించారు.

యువత కేవలం ఉద్యోగాలు ఆశించే వారిగా ఉండిపోవద్దని, ఉద్యోగాలు సృష్టించే వారిగా ఆలోచించాలని, ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. ముఖ్యంగా ఏఐ, రోబోటిక్స్, సెమీకండక్టర్స్, సైబర్ సెక్యూరిటీ, డ్రోన్ టెక్నాలజీ, 3డీ ప్రింటింగ్, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాలు భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను సృష్టించగలవని, వీటిపైన యువత దృష్టి సారించాలని సూచించారు. భారతదేశంలో ప్రతిభ, నైపుణ్యాలు కలిగిన మానవవనరులు, స్టార్టప్‌లకు అపారమైన అవకాశాలు ఉన్నాయి. ఈ అవకాశాలను ఉపయోగించుకుని దేశానికి మరిన్ని పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలను తీసుకురావాలి యువతకు శ్రీ కిషన్‌రెడ్డి సూచించారు.

నూతనంగా ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను ఉద్దేశించి శ్రీ కిషన్‌రెడ్డి పలు సూచనలు చేశారు. వికసిత భారత్ లక్ష్యసాధన కోసం నిబద్ధత, బాధ్యతతో పనిచేయాలని కోరారు. ఉద్యోగాలు వచ్చినప్పటికీ కొత్త విషయాలు నేర్చుకోవడం మాత్రం ఆపకూడదని, అధునాతన సాంకేతికతలు, నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగం అంటే ఉద్యోగ భద్రత మాత్రమే కాదని, ప్రజలకు సేవ చేసే బాధ్యత అనే విషయాన్ని గుర్తుంచుకోవాలని కోరారు. ఉద్యోగాల్లో చేరిన తర్వాత సైతం తమ కోసం కష్టపడిన తల్లిదండ్రులను, పుట్టి, పెరిగిన ఊరిని, చదువుకున్న బడిని మర్చిపోవద్దని అన్నారు. పేదల సంక్షేమ, దేశాభివృద్ధి కోసం పనిచేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఆదాయపు పన్ను శాఖ తెలంగాణ, ఏపీ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ శ్రీ సురేశ్ బత్తిని, ఆదాయపు పన్ను శాఖ ఇన్‌వెస్టిగేషన్ డీజీ శ్రీ రాజర్షి ద్వివేది, అదాయపు పన్ను శాఖ హైదరాబాద్ చీఫ్ కమిషనర్ శ్రీమతి సునీత బెల్లా తదితరులు పాల్గొన్నారు.

# సబ్సిడీపై ఇచ్చే గృహ ఎల్‌పీజీ సిలిండర్లకు అక్టోబర్ 1 నుంచి బయోమెట్రిక్ ఆధార్ ధ్రువీకరణ తప్పనిసరి

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 21:సబ్సిడీ వర్తించే నియంత్రిత రిటైల్ విక్రయ ధర (ఆర్ఎస్పీ)కు గృహ ఎల్‌పీజీ సిలిండర్ రీఫిల్ బుక్ చేసుకోవాలంటే 2026 అక్టోబర్ ఒకటి నుంచి బయోమెట్రిక్ ఆధార్ ధ్రువీకరణ (బీఏఏ) పూర్తి చేసి ఉండాలి.

బయోమెట్రిక్ ఆధార్ ధ్రువీకరణ ద్వారా సబ్సిడీతో కూడిన ఎల్‌పీజీ నిజమైన, అర్హత కలిగిన కుటుంబాలకు మాత్రమే చేరేలా నిర్ధారించవచ్చు. ప్రతి గ్యాస్ కనెక్షన్‌ను ఆధార్ ధ్రువీకరించిన వినియోగదారుతో అనుసంధానం చేయడం వల్ల సబ్సిడీతో అందించే గృహ ఎల్‌పీజీ సిలిండర్లను వాణిజ్య, పారిశ్రామిక అవసరాలకు మళ్లించడాన్ని అరికట్టడంతో పాటు నకిలీ, అనర్హమైన కనెక్షన్లను తొలగించేందుకు వీలు కలుగుతుంది. తద్వారా సబ్సిడీ పంపిణీ మరింత పారదర్శకంగా నిర్దేశిత అర్హులకు మాత్రమే అందుతుంది. ఈ ప్రక్రియ అర్హత కలిగిన కుటుంబాలకు ఎల్‌పీజీని నిరాకరించడానికి ఉద్దేశించినది కాదు. ప్రతి అర్హత కలిగిన వినియోగదారుడు ఆధార్ ధ్రువీకరణ పూర్తి చేయడానికి పలు సులువైన మార్గాలు అందుబాటులో ఉన్నాయి.

ఇప్పటికే బయోమెట్రిక్ ఆధార్ ధ్రువీకరణ పూర్తి చేసిన వినియోగదారులు మళ్లీ ధ్రువీకరణ చేయాల్సిన అవసరం లేదు. వారికి సిలిండర్ సరఫరా ప్రక్రియ యథావిధిగా కొనసాగుతుంది.

బయోమెట్రిక్ ఆధార్ ధ్రువీకరణ పూర్తి చేయని వినియోగదారులకు ధ్రువీకరణ పూర్తయిన తర్వాత సబ్సిడీతో కూడిన నియంత్రిత రిటైల్ విక్రయ ధరకు రీఫిల్ బుకింగ్ సదుపాయం అందుబాటులోకి వస్తుంది.

బయోమెట్రిక్ ఆధార్ ధ్రువీకరణ పూర్తి చేయడానికి ఇష్టపడని లేదా పూర్తి చేయలేని వినియోగదారులు ఇప్పటికీ ఎల్‌పీజీ పొందవచ్చు. ఇందుకోసం తమ ఎంపికను సంబంధిత చమురు మార్కెటింగ్ సంస్థ డిజిటల్ వేదికల్లో నమోదు చేసుకోవాలి. వినియోగదారు వెబ్ పోర్టల్, మొబైల్ యాప్, వాట్సాప్ చాట్ బాట్, ఐవీఆర్ఎస్ లేదా అందుబాటులో ఉన్న ఇతర మార్గాల ద్వారా ఈ ఎంపికను నమోదు చేసుకోవచ్చు. ఈ వినియోగదారులకు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల వద్ద స్థానికంగా లభ్యమయ్యే నిల్వలకు లోబడి, ఎటువంటి రాయితీ లేకుండా మార్కెట్ ధరపై 5 కిలోలు లేదా 10 కిలోల సిలిండర్లలో ఎల్పీజీ సరఫరా చేస్తారు. 2026 సెప్టెంబర్ 19 నాటికి 27.43 కోట్ల మంది గృహ ఎల్‌పీజీ వినియోగదారులు బయోమెట్రిక్ ఆధార్ ధ్రువీకరణ పూర్తి చేశారు. దీంతో మొత్తం వినియోగదారుల్లో 89.9 శాతం మంది ధ్రువీకరణ పూర్తి చేసినట్ల యింది.

వినియోగదారులు 2026 జూన్ 30లోగా బయోమెట్రిక్ ఆధార్ ధ్రువీకరణ ( పూర్తి చేయాలని తొలుత సూచించారు. వినియోగదారులకు మరింత సమయం కల్పించేందుకు తరువాత గడువును పలుమార్లు పొడిగించారు. తొలుత జూలై 31 వరకు, అనంతరం ఆగస్టు 7, ఆగస్టు 15, ఆగస్టు 23, ఆగస్టు 31, సెప్టెంబర్ 7 వరకు పొడిగించి, చివరగా 2026 సెప్టెంబర్ 14 వరకు గడువు ఇచ్చారు.

2023 అక్టోబర్ నుంచి చమురు మార్కెటింగ్ సంస్థలు దేశవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ఇప్పటివరకు 12 కోట్లకు పైగా ఎస్ఎంఎస్, వాట్సాప్ సందేశాలను పంపించాయి. బయోమెట్రిక్ ఆధార్ ధ్రువీకరణ పూర్తి చేయని వినియోగదారులను గుర్తించి, డిస్ట్రిబ్యూటర్లు, డెలివరీ సిబ్బంది వ్యక్తిగతంగా సంప్రదించి ధ్రువీకరణ పూర్తి చేసేలా చర్యలు చేపట్టారు. డిస్ట్రిబ్యూటర్ కేంద్రాలు, అధిక సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగించే ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. సిలిండర్ రీఫిల్ బుకింగ్ సమయంలో ఐవీఆర్ఎస్ ద్వారా సూచనలు, మొబైల్ నోటిఫికేషన్లు, సామాజిక మాధ్యమాలు, వార్తాపత్రికలు, ఇతర ప్రచార మాధ్యమాల ద్వారా కూడా విస్తృతంగా అవగాహన కల్పించారు.

గృహ ఎల్‌పీజీని ఉత్పత్తి వ్యయం కంటే తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. 2026 సెప్టెంబర్‌లో 14.2 కిలోల సిలిండర్‌పై సబ్సిడీ సుమారు రూ.210గా ఉంది. 2026 జూన్‌లో ఇది ఒక్కో సిలిండర్‌కు రూ.721కు చేరుకుంది.గృహ ఎల్‌పీజీని అందుబాటు ధరలో కొనసాగించేందుకు ప్రభుత్వం 2022 - 23 ఆర్థిక సంవత్సరంలో చమురు మార్కెటింగ్ సంస్థలకు రూ.22,000 కోట్ల పరిహారం చెల్లించింది. 2025 - 26, 2026 - 27 ఆర్థిక సంవత్సరాల్లో కలిపి రూ.30,000 కోట్లను చెల్లిస్తోంది. అయినప్పటికీ, 2026 ఆగస్టు 31 నాటికి ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలకు గృహ ఎల్‌పీజీ విక్రయాలపై పేరుకుపోయిన అండర్ రికవరీలు రూ.62,000 కోట్లను మించాయి. సబ్సిడీని నిజమైన, అర్హత కలిగిన వినియోగదారులకు మాత్రమే అందించడం ద్వారా దాన్ని దీర్ఘకాలం కొనసాగించేందుకు వీలు కలుగుతుంది. ఇప్పటివరకు బయోమెట్రిక్ ఆధార్ ధ్రువీకరణ పూర్తి చేయని వినియోగదారులు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న పై పేర్కొన్న ఏదైనా మార్గం ద్వారా 2026 అక్టోబర్ 1లోగా బీఏఏ పూర్తి చేయాలని కోరుతున్నారు.

# లక్నో డివిజన్‌లోని 607.7 కిలోమీటర్ల మార్గంలో రూ. 252 కోట్లతో కవచ్ 4.0 ఏర్పాటు కోసం భారతీయ రైల్వే ఆమోదం

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 21:స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా రైల్వే భద్రత బలోపేతం దిశగా కీలక ముందడుగు వేస్తూ, ఈశాన్య రైల్వేలోని లక్నో డివిజన్‌కు చెందిన 607.7 రూట్ కిలోమీటర్ల మేర కవచ్ వెర్షన్ 4.0ను మొత్తం రూ.252 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయడానికి భారతీయ రైల్వే ఆమోదం తెలిపింది.

ఆమోదించిన ఈ ప్రాజెక్ట్... డివిజన్‌లో గుర్తించిన మిగిలిన విభాగాల్లో కవచ్ 4.0 కవరేజీని విస్తరింపజేస్తూ, రైలు కార్యకలాపాలకు అందుబాటులో ఉన్న భద్రతా మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తుంది.కార్యాచరణ భద్రతను మెరుగుపరచడానికి రూపొందించిన, స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన ఒక ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ (ఏటీపీ) వ్యవస్థే కవచ్. ఇది ప్రమాదకర పరిస్థితుల్లో సిగ్నల్ దాటడాన్ని నివారిస్తుంది. అవసరమైనప్పుడు స్వయంచాలకంగా బ్రేకులు వేస్తుంది. రైలు కార్యకలాపాలను పర్యవేక్షించడం ద్వారా సురక్షితమైన రైలు రవాణాకు మద్దతునిస్తుంది.

# అక్టోబర్ నుంచి డీడీయూ-జీకేవై 2.0 శిక్షణ బ్యాచ్‌లను ప్రారంభించనున్న గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 21:అనేక రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 2026 అక్టోబర్ నుంచి దీన్ దయాళ్ ఉపాధ్యాయ-గ్రామీణ కౌశల్య యోజన (డీడీయూ-జీకేవై) 2.0 శిక్షణ బృందాలను ప్రారంభించేందుకు గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ సిద్ధమైంది. శిక్షణ బ?ందాల ప్రారంభానికి సంబంధించిన సన్నద్ధతపై తొలి దశలో 14 రాష్ట్రాలు,కేంద్రపాలిత ప్రాంతాలతో సమీక్ష నిర్వహించారు. అవి ఒడిశా, మిజోరం, సిక్కిం, మధ్యప్రదేశ్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, పుదుచ్చేరి, కర్ణాటక, తెలంగాణ, బిహార్.

ఈ 14 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 2026 అక్టోబర్‌లో 34,920 మంది గ్రామీణ యువతతో కూడిన 1,164 శిక్షణ బ్యాచ్ లు ప్రారంభం కానున్నాయి. 2027 డిసెంబర్ 31 నాటికి ఈ 14 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మొత్తం 3,57,112 మంది గ్రామీణ యువతకు శిక్షణ అందించాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించింది. డీడీయూ-జీకేవై 2.0 వేదిక ప్రకారం 24 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు 1,200కు పైగా ప్రాజెక్టులకు 5.6 లక్షల శిక్షణ లక్ష్యాలను కేటాయించారు. ఇతర రాష్ట్రాలు లక్ష్యాల కేటాయింపు ప్రక్రియలో తుది దశలకు చేరుకున్నాయి. దశలవారీగా నిర్వహిస్తున్న సమీక్షా సమావేశాలు శిక్షణ బ్యాచ్‌ల ప్రారంభ ప్రక్రియను వేగవంతం చేయనున్నాయి.

డీడీయూ-జీకేవై పేద గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలతో కూడిన నైపుణ్య శిక్షణ అందించే కేంద్ర ప్రాయోజిత పథకం. ఈ శిక్షణ వ్యవధి 3 నెలల నుంచి 12 నెలల వరకు ఉంటుంది. డీడీయూ-జీకేవై 2.0 అమలుకు సంబంధించి రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సన్నద్ధతను సమావేశంలో సమీక్షించారు. 2026?28 రెండేళ్ల కాలానికి ఈ పథకంలో పాల్గొంటున్న మొత్తం 31 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు శిక్షణ లక్ష్యాలను కేటాయించారు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు చేపట్టాల్సిన చర్యలకు ఇది కీలక దశ అని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ప్రాజెక్టు అమలు సంస్థలకు (పీఐఏలు) శిక్షణ లక్ష్యాల కేటాయింపును వేగవంతం చేయడంతో పాటు, నిర్దేశించిన కాలపరిమితులకు అనుగుణంగా శిక్షణ బ్యాచ్‌లను ప్రారంభించాలని అమలు చేస్తున్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు పిలుపునిచ్చింది.

శిక్షణ ప్రారంభానికి వీలుగా 2026 అక్టోబర్ 31లోగా ప్రాజెక్టు అమలు సంస్థలకు (పీఐఏలు) లక్ష్యాలను కేటాయించేలా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు సన్నద్ధతలో వివిధ దశల్లో ఉన్నాయి. అమలు చేస్తున్న 31 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి ఈ మంత్రిత్వ శాఖకు అందిన సమాచారం ప్రకారం అర్హులైన గ్రామీణ యువతను సమీకరించేందుకు ఇప్పటికే 5 లక్షలకు పైగా శిక్షణ లక్ష్యాలను పీఐఏలకు కేటాయించారు. చాలా రాష్ట్రాల్లో 2026 అక్టోబర్‌లోనే యువత సమీకరణ, శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించే అవకాశం ఉంది.

డీడీయూ-జీకేవై 2.0 సమగ్ర వేదిక ప్రాజెక్టు జీవితచక్రంలోని అన్ని దశలను సమర్థవంతంగా నిర్వహించేలా రూపొందించామని, తద్వారా మరింత సామర్థ్యం, పారదర్శకత, డిజిటల్ పర్యవేక్షణకు వీలు కలుగుతుందని మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

ఇంకా పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర ఖజానా వేదికలతో అనుసంధాన ప్రక్రియను సమీక్షించారు. గ్రామీణ కౌశల్య వేదిక ద్వారా ఆన్‌లైన్ చెల్లింపులు సులభతరం చేసేందుకు అవసరమైన అనుసంధాన ప్రక్రియను 2026 సెప్టెంబర్ 30లోగా పూర్తి చేయాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సూచించారు.

పీఐఏలకు పూర్తి స్థాయి డిజిటల్ వేదికపై అవగాహన కల్పించేందుకు మంత్రిత్వ శాఖ 2026 అక్టోబర్‌లో నాలుగు ప్రాంతాల్లో హైబ్రిడ్ విధానంలో ప్రాంతీయ వర్క్‌షాప్‌లను నిర్వహిస్తోంది. ఈ వర్క్‌షాప్‌లకు కొంతమంది పీఐఏలు భౌతికంగా హాజరయ్యేలా చూడాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కోరారు. షిల్లాంగ్‌లో 5.10.2026న, విజయవాడలో 7.10.2026న, ముంబైలో 9.10.2026న, ధర్మశాలలో 16.10.2026న ఈ వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నారు. ఈ వర్క్‌షాప్‌ల ద్వారా డీడీయూ-జీకేవై 2.0 వేదిక, దాని ప్రక్రియలు, సౌకర్యాలపై పీఐఏలకు అవగాహన కల్పించడంతో పాటు, అమలుకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం లభిస్తుంది.

సమావేశంలో పథకం ఆర్థిక పరిస్థితిని కూడా సమీక్షించారు. సమీక్షలో పాల్గొన్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు 2026 అక్టోబర్ నుంచి శిక్షణ బ్యాచ్‌లు ప్రారంభం కావడంతో పథకం కింద వ్యయం పెరిగే అవకాశం ఉందని తెలిపాయి. వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా నిర్వహించిన ఈ సమీక్షా సమావేశంలో నైపుణ్యాల విభాగం సంయుక్త కార్యదర్శి, డైరెక్టర్ (స్కిల్స్), వివిధ రాష్ట్రాలకు చెందిన సీఈఓలు, సీఓఓలు, ఇతర రాష్ట్ర అధికారులు పాల్గొన్నారు.



సోమవారం దీప కల ఫ్రెండ్స్ అసోసియేషన్ వారి 49వ గణపతి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని పూజలు నిర్వహించిన సికింద్రాబాద్ రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ గారు మరియు గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాబ్జి , సీనియర్ నాయకుడు మర్రిశెట్టి నర్సింగ్ రావు మరియు అభిషేక్ అయినది పాల్గొన్నారు అని సంఘ అధ్యక్షుడు ఎస్ టి అశోక్ మరియు ఎస్ టి ప్రేమ్ తెలియజేశారు..

# రాష్ట్రీయ సంకల్ప్ సమారోహ్.. 1,000 ప్రాంతాల నుంచి 4 లక్షల మందికి పైగా పాల్గొన్న యువత

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 21: వికసిత్ భారత్ లక్ష్య సాధన క్రమంలో నషా ముక్త్ యువా ఆశయంతో, 100 వారాల పాటు నషా ముక్త్ యువా అభియాన్‌ను భారతదేశమంతటా 1,000కి పైగా ప్రాంతాలలో నిర్వహించారు. ఈ ఉద్యమంలో యువతీ యువకులు, పౌరులు మొత్తం 4 లక్షల కన్న ఎక్కువ మంది పాల్గొన్నారు. నషా ముక్త్ భారత్ (మత్తు పదార్థాలకు చోటుండని భారత్)ను ఆవిష్కరించే దిశగా ఉమ్మడి నిబద్ధతను ప్రకటించడానికి దేశం నలుమూలల నుంచి ప్రజలు పాలు పంచుకోవాల్సిందిగా ఆహ్వానించిన ఈ కార్యక్రమంలో, యువజనులతో పాటు భాగస్వామ్య సంస్థలు, ప్రజలు పెద్ద ఎత్తున పాలుపంచుకున్నాయి.

నషా ముక్త్ యువా ప్రచార ఉద్యమంలో యువతతో పాటు పౌరులు పాల్గొనడానికి వీలుగా, ఈ కార్యక్రమాన్ని 460 మై భారత్ జిల్లాలలో మై భారత్‌కు చెందిన భాగస్వామ్య సంస్థలకు చెందిన 240 ప్రాంతాల్లో, ఉద్యోగ సంఘాలు, విశ్వవిద్యాలయాల సంఘాల ఆధ్వర్యంలో 300 కన్న ఎక్కువ ప్రాంతాల్లో నిర్వహించారు.

ఉమ్మడి సంకల్పం, యువత నాయకత్వంలో భాగస్వామ్యం అన్న భావనలను ఆధారం చేసుకొని 'రాష్ట్రీయ సంకల్ప్ సమారోహ్'ను నిర్వహించారు. దీనిలో పాల్గొన్న వారు నషా ముక్త్ ప్రతిజ్ఞను స్వీకరించడంతో పాటు సంతకాలు కూడా చేశారు. యువత సారథ్యంలో చర్చలను, చైతన్య కార్యక్రమాలను, ఇతర స్థానిక కార్యక్రమాలతో పాటు, సృజనాత్మకత, భాగస్వామ్యం ప్రధానంగా ఉండే కార్యక్రమాలను కూడా నిర్వహించారు. మాదకద్రవ్యాల అలవాటుకు దూరంగా జీవన శైలిని అలవరుచుకోవాలన్న సందేశాన్ని ప్రజల చెంతకు మరింత ప్రభావవంతంగా తీసుకుపోవాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.


వికసిత్ భారత్ లక్ష్యానికి దోహదం చేసే నషా ముక్త్ భారత్ ప్రచార ఉద్యమంలో యువజనులు, భాగస్వామ్య సంస్థలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. చైతన్యాన్ని పెంపొందింపచేయడం, మాదకద్రవ్యాల ఉపయోగాన్ని నివారించడం, ఆరోగ్యంగా ఉండడానికి అనుసరించాల్సిన ప్రత్యామ్నాయ మార్గాలను సూచించడం, యువత సకారాత్మక భాగస్వామ్యాన్ని విస్తరించడం ఈ కార్యక్రమ ధ్యేయాలు. సంకల్ప్ సమారోహ్‌తో సంస్థలను, సంఘాలను, ప్రజలను ఒకే తాటి మీదకు తీసుకువచ్చి, విషయాలను యువత తెలుసుకొని జాగరూకంగా ఉంటూ ఆరోగ్యకర జీవన శైలిని అవలంబించడానికి ప్రాధాన్యాన్ని ఇచ్చేటట్లు చూడడానికి ఉమ్మడి వేదికను అందిస్తున్నారు.

ఈ కార్యక్రమం 100 వారాల పాటు కొనసాగించే నషా ముక్త్ యువా అభియాన్లో ఓ భాగం. దీనిని మాదక ద్రవ్యాల సేవన నివారణ, అవగాహన, ఆరోగ్యం, శరీర దారుఢ్యం, జీవన నైపుణ్యాలపై ప్రత్యేకంగా దృష్టి సారించడంతో పాటు నిలకడతనంతో కూడిన ఒక యువజన ఉద్యమ రూపంలో నిర్వహిస్తున్నారు. మొదటి దశ కార్యకలాపాల్లో 'నా ఆరోగ్యం', 'నా గౌరవం', 'ఫిట్ యూత్' అనే మూడు ఇతివృత్తాలతో పాటు, 'జీవన నైపుణ్యాల మాసం' కూడా భాగాలుగా ఉంటాయి. దీని ద్వారా సముదాయ ఆధారిత, యువ ప్రధాన కార్యకలాపాలను నిర్వహించి యువతీయువకుల భాగస్వామ్యాన్ని నిరంతర ప్రాతిపదికన ప్రోత్సహించనున్నారు.

ఈ నెల 18న జన సమీకరణ కోసం వివిధ సంస్థలు, సముదాయాల్లో అనేక కార్యక్రమాల్ని ఏర్పాటు చేశారు. రెండు రోజుల తరువాత సెప్టెంబర్ 20న జాతీయ స్థాయి భాగస్వామ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు రోజుల పాటు చేపట్టిన జనసమీకరణలో ప్రతిజ్ఞలు, సంతకాలు, చర్చ, ప్రజా భాగస్వామ్యం ద్వారా యువతను, పౌరులను సమావేశపరిచారు. దీంతో నిరంతర ప్రచార ఉద్యమానికి బలమైన పునాదిని వేసినట్లయింది.

నషా ముక్త్ భారత్‌ను ఆవిష్కరించడం ఓ సామూహిక ప్రయత్నమని రాష్ట్రీయ సంకల్ప్ సమారోహ్ స్పష్టం చేస్తోంది. దీని కోసం యువజనులు, సంస్థలు, సముదాయాల నిరంతర అవగాహన, సకారాత్మక ప్రత్యామ్నాయాలు, చురుకైన భాగస్వామ్యం నెలకొనడం చాలా అవసరం.

వికసిత్ భారత్ లక్ష్య సాధన కోసం నషా ముక్త్ యువా. 100 వారాల నషా ముక్త్ యువా అభియాన్లో భాగంగా యువత నాయకత్వంలో భాగస్వామ్యాన్ని యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నిరంతర ప్రాతిపదికన ముందుకు తీసుకుపోనున్నది. దీని ద్వారా నిరంతర భాగస్వామ్యాన్నీ, సకారాత్మక కార్యాచరణనీ యువత అనుసరించేటట్లు చూస్తూ, ఈ సందేశాన్ని విస్తృత స్థాయిలో ప్రచారం చేసే విధంగా వారిని ప్రోత్సహించనుంది.



## కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి.. నివాళులర్పించిన హరీశ్‌రావు, కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 21: తెలంగాణ ఉద్యమ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు, కేటీఆర్ నివాళులర్పించారు. తెలంగాణ కోసం బాపూజీ చేసిన త్యాగాలను, ప్రజా ఉద్యమాల్లో ఆయన పోషించిన కీలక పాత్రను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

**పదవుల కంటే ప్రజల పక్షాన నిలబడటమే నాయకత్వం: హరీశ్‌రావు**

కొండా లక్ష్మణ్ బాపూజీ పదవుల కంటే ప్రజల పక్షాన నిలబడటమే నాయకత్వమని తన ఆచరణతో చూపిన గొప్ప దార్శనికుడని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరం నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన వరకు ఆయన జీవితం నిరంతర పోరాటంగా సాగిందన్నారు.

1969 తెలంగాణ ఉద్యమ సమయంలోనే బాపూజీ తన మంత్రి పదవిని తృణప్రాయంగా వదులుకున్నారని హరీశ్‌రావు గుర్తుచేశారు. బడుగు, బలహీన వర్గాలు, చేనేత కార్మికుల పట్ల ఆయనకున్న నిబద్ధత స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ.. వర్ధంతి సందర్భంగా మహనీయుడికి ఘన నివాళులు అర్పించారు.

**'ఉద్యమాలే ఊపిరిగా బతికిన ధీశాలి': కేటీఆర్**

కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యమాలనే ఊపిరిగా, పోరాటాలనే పరమావధిగా జీవించిన ధీశాలి అని కేటీఆర్ పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమం నుంచి మలిదశ తెలంగాణ ఉద్యమం వరకు ప్రజా ఉద్యమాల్లో ఆయన పాత్ర మరువలేనిదన్నారు.

# ఇంధనం.. ఖనిజాలు.. అత్యాధునిక పదార్థాలు.. పరిశోధన-అభివృద్ధి రంగాల్లో సాంకేతికతాధారిత వైవిధ్యీకరణ బాటలో కోల్ ఇండియా

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 21:కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) తన సంప్రదాయ బొగ్గు తవ్వకం కార్యకలాపాలకు మరింత వైవిధ్యం, సాంకేతికతలను జోడిస్తూ భిన్న రంగాలకు విస్తరిస్తోంది. ఈ మేరకు ఇంధనం, ఖనిజాలు, అత్యాధునిక పదార్థాలు, పరిశోధన-అభివృద్ధి రంగాల్లో వ్యాపారాభివృద్ధి కోసం 5 వేదికల పరస్పర బలోపేతం దిశగా పయనిస్తోంది. ఈ జాబితాలో బొగ్గు గ్యాసిఫికేషన్ (వాయువుగా మార్చడం)-రసాయనాల వెలికితీత, థర్మల్ విద్యుత్తు, పునరుత్పాదక ఇంధనం-నిల్వ; కీలక ఖనిజాలు, అత్యాధునిక పదార్థాలు, ఇనుము సహా వైవిధ్య ఖనిజాలు ఉన్నాయి.

ఇందులో భాగంగా ఇప్పటికే జాతీయ స్థాయి ప్రాజెక్టులు పురోగమనంలో ఉన్నాయి. వీటిలో బొగ్గు నుంచి రసాయనాల వెలికితీత సంబంధిత 4 కార్యక్రమాల కింద సుమారు ?69,346 కోట్లు, చంద్రాపురలో 2800 మెగావాట్ల అల్ట్రా-సూపర్‌క్రిటికల్ థర్మల్ కేంద్రం విస్తరణ, సుమారు 550 మెగావాట్ల సౌర విద్యుత్ సామర్థ్యం, గ్రిడ్ స్థాయి బ్యాటరీ ఇంధన నిల్వ వ్యవస్థ (బీఈఎస్ఎస్) కార్యక్రమాలను చేపట్టింది. దీంతోపాటు కీలక ఖనిజాలు, అంతిమ ఉత్పత్తుల పరంగానూ అవకాశాలున్నాయి.

దేశవ్యాప్తంగా సీఐఎల్ విస్తృతి, మైనింగ్-ప్రాజెక్టుల అభివృద్ధి అనుభవం, ప్రభుత్వ సంబంధాలు, భూమి-బొగ్గు వనరులు, కొనుగోలు వ్యవస్థలు, బ్యాలెన్స్ షీట్, భాగస్వామ్య సామర్థ్యం వంటివి సంస్థ వైవిధ్యీకరణకు బలమైన వేదికగా నిలుస్తాయి. "నిర్దిష్ట ప్రయోజన వైవిధ్యీకరణ'' మార్గనిర్దేశం సూత్రంతో వాణిజ్య స్థిరత్వం-ముప్పుల సర్దుబాటుతో రాబడులను కొనసాగిస్తుంది. అలాగే, ఇంధన-ఖనిజ భద్రత, దిగుమతి ప్రత్యామ్నాయం, స్వదేశీ సాంకేతికత, స్వల్ప కర్బన ఆధారిత వృద్ధి, ప్రభుత్వ-స్వీయ ఆస్తుల సమర్థ వినియోగం, పునరుత్థాన తయారీ రంగానికి మద్దతిస్తుంది.

బొగ్గు గ్యాసిఫికేషన్.. బొగ్గు నుంచి రసాయనాలు.. భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్

గ్యాసిఫికేషన్ ప్రక్రియ కింద బొగ్గును సింథసిస్ గ్యాస్ లేదా సింగాస్‌గా మారుస్తారు. దీనితో సింథటిక్ నేచురల్ గ్యాస్ (ఎస్ఎన్‌జీ), అమ్మోనియా, యూరియా, అమ్మోనియం నైట్రేట్, మెథనాల్ వంటి రసాయనాలను ఉత్పత్తి చేయవచ్చు. ఈ సాంకేతికత ద్వారా దిగుమతి ప్రత్యామ్నాయానికి తోడ్పాటు సహా బొగ్గు నుంచి రసాయనాల వెలికితీత సాధ్యమవుతుంది.

బొగ్గు నుంచి రసాయనాల వెలికితీత కోసం సీఐఎల్ పరిధిలో యొక్క నాలుగు ప్రధాన ప్రాజెక్టులున్నాయి: . తాల్చేర్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్.. అంచనా వ్యయం 19,062.22 కోట్లు.. 1.27 ఎంఎంటీపీఏ యూరియా ఉత్పాదక సామర్థ్యం. 2. భారత్ కోల్ గ్యాసిఫికేషన్ అండ్ కెమికల్స్ లిమిటెడ్.. అంచనా వ్యయం ?25,015.89 కోట్లు.. 0.66 ఎంఎంటీపీఏ అమ్మోనియం నైట్రేట్ ఉత్పాదక సామర్థ్యం. 3. కోల్ గ్యాస్ ఇండియా లిమిటెడ్.. అంచనా వ్యయం 13, 052.81 కోట్లు.. ఏటా 633.6 మిలియన్ ఎన్ఎంక్యూ ఎస్ఎన్‌జీ సామర్థ్యం. 4. చంద్రాపూర్‌లో బొగ్గు నుంచి ఎస్ఎన్‌జీ ఉత్పత్తికి సీఐఎల్-బీపీసీఎల్ సంయుక్త ప్రాజెక్టు.. అంచనా వ్యయం 12, 214.86 కోట్లు.. ఉత్పాదనలో 633.6 మిలియన్ ఎన్ఎంక్యూ మేర వార్షిక సామర్థ్యం.

అధిక బూడిదగల భారత బొగ్గుకు తగినట్లు ప్రక్రియలను వైవిధ్యీకరించడం ఈ కార్యక్రమాల సాంకేతిక ప్రాథమ్యాలలో ఒకటి. అంతేకాకుండా ప్రక్రియ గరిష్ఠీకరణ, కీలక పరికరాల స్థానికీకరణ, అత్యాధునిక నియంత్రణ, డిజిటల్ ట్విన్స్, ప్రిడిక్టివ్ మెయింటెనెన్స్, జలవనరులు, బూడిద-ఉద్గారాల మెరుగైన నిర్వహణ ఇందులో అంతర్భాగంగా ఉంటాయి.

డేటా-వాణిజ్య సామర్థ్యం ధ్రువీకరణ అనంతరం మాత్రమే ప్రాజెక్టుల అనుసరణ చర్యలు చేపడతారు.

భూగర్భంలో గల లేదా ఇతరత్రా తవ్వకం వీలుకాని బొగ్గును 'భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్' (యూసీజీ) ప్రక్రియ 'సింగాస్'గా మార్చగలదు. అయితే, అంతర్జాతీయ స్థాయిలో ఈ సాంకేతికత ఇంకా వాణిజ్య పరంగా విజయవంతం కాలేదు. ఈ నేపథ్యంలో ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ఈసీఎల్) పరిధిలోని 'కాస్టా వెస్ట్ బ్లాక్' (గనుల)లో ఈ ప్రయోగాత్మక ప్రాజెక్టును సీఐఎల్ దశలవారీగా చేపట్టింది. ఇందులో తొలి దశ 2025 మే 31న పూర్తికాగా, రెండో దశ అదే ఏడాది జూన్ 20న ప్రారంభమైంది. దీనికింద సమగ్ర ఇంజినీరింగ్, డైరెక్షనల్ డ్రిల్లింగ్, ఇంజెక్షన్, ఉత్పత్తి బావులు, ఇగ్నిషన్-నియంత్రణ వ్యవస్థలుండగా, ఇది ఈ ఏడాది (2026)లోగా పూర్తి కావాల్సి ఉంది.

సీఐఎల్, దామోదర్ వ్యాలీ కార్పొరేషన్ (డీవీసీ) సంస్థలు ప్రతిపాదిత 50:50 నిష్పత్తితో సంయుక్తంగా జార్ఖండ్‌లోని చంద్రాపురాలో 2800 మెగావాట్ల అల్ట్రా-సూపర్ క్రిటికల్ ప్రాజెక్టు విస్తరణ కార్యక్రమాన్ని చేపట్టాయి. ఇక్కడ ఉత్పత్త్యయ్యే విద్యుత్తు విక్రయ కార్యకలాపాలకు డీవీసీ సమన్వయం చేస్తుంది. భవిష్యత్తులో అధిక-పొదుపుతో ఉత్పాదన, ప్రిడిక్టివ్ మెయింటెనెన్స్, ఫ్లెక్సిబుల్ ప్లాంట్ ఆపరేషన్, ఉద్గార నియంత్రణ, జలల పునరుపయోగం, బూడిద శాస్త్రీయ వినియోగం తదితరాలపై దృష్టి సారిస్తారు.

ఇక సౌరశక్తి ప్రాజెక్టులకు సంబంధించి సుమారు 550 మెగావాట్ల సామర్థ్యంతో ఉత్పాదనను సీఐఎల్ ప్రారంభించింది, దీనికితోడు పైకప్పుల మీద, భూ ఉపరితలంపైన, స్వతంత్ర, అంతర్రాష్ట్ర, మార్కెట్-సంధానిత ప్రాజెక్టులు పురోగమనంలో ఉన్నాయి. సౌరశక్తి విషయంలో సీఐఎల్ రెండు పద్ధతులను అనుసరిస్తోంది. వీటిలో ఒకటి- విద్యుతుద్వాన వ్యయాన్ని, కర్బన ఉద్గారాలను తగ్గించే స్వతంత్ర ప్రాజెక్టులు. మరొకటి వాణిజ్య పునరుత్పాదక-విద్యుదుత్పాదన కోసం వినియోగ స్థాయి ప్రాజెక్టులు.

వనరుల నాణ్యత, ప్రసారం, భూమి లభ్యత, నిల్వ, కోత, కొనుగోలు-సరఫరా వ్యయం తదితరాల సంబంధిత 'లైఫ్‌సైకిల్', ముప్పు ప్రాతిపదికగల అంచనాలపై సౌరశక్తి ప్రాజెక్టుల ఎంపిక ఆధారపడి ఉంటుంది. డిజిటల్ పర్యవేక్షణ, హైబ్రిడ్ నిల్వ పరిష్కారాలు వంటివి ప్రాజెక్టు సామర్థ్యానికి, కార్యాచరణ సౌలభ్యానికి తోడ్పడతాయి.

గోరఖ్‌పూర్‌లోని చిల్వా తాల్ వద్ద 20 మెగావాట్ల ఏసీ గ్రిడ్-కనెక్టెడ్ జలోపరితల సౌరశక్తి ప్రాజెక్టును కూడా సీఐఎల్ ఏర్పాటు చేస్తోంది. జలాశయాలకు అనువైన ఈ సౌరశక్తి భూ ఉపరితల ఉత్పాదనతో పోలిస్తే చౌకగా ఉంటుంది. అయితే- నీటి మటాలు, బాతిమెట్రీ, గాలి-అలలు, యాంకరింగ్, తుప్పు, నిర్వహణ, భద్రత, పర్యావరణ సంబంధిత ముప్పుల నివారణ దిశగా ప్రాదేశిక నిర్దిష్ట అంచనా, ప్రామాణిక తనిఖీ ప్రక్రియలు అవసరం.

పునరుత్పాదక-ఇంధనాల ఏకీకరణ, గరిష్ఠ డిమాండ్ నిర్వహణ, గ్రిడ్ సారళ్యం, మెరుగైన ప్రసారం-వినియోగానికి బ్యాటరీ ఇంధన నిల్వ వ్యవస్థలు (బీఈఎస్ఎస్) మద్దతిస్తాయి. దీనికి సంబంధించి సీఐఎల్ కార్యక్రమాలలో తెలంగాణలోని చౌటుప్పల్ వద్ద 'టీజీజెన్‌కో' ఒక కేంద్రం ఏర్పాటు చేయనుంది. ఇది 187.5 మెగావాట్లు, 750 మెగావాట్-గంటల సామర్థ్యం, 4 గంటల వ్యవధితో ఈ ప్రాజెక్టును సీఐఎల్ చేపడుతోంది. అయితే, ఈపీసీ ఎంపిక, దీర్ఘకాలిక కార్యకలాపాల నిర్వహణ ఏర్పాట్లు పురోగమనంలో ఉన్నాయి.

ఒడిశాలోని నాలుగు ప్రదేశాలలో 80 మెగావాట్లు/ 320 మెగావాట్-గంటల సామర్థ్యంతో, నాలుగు గంటల వ్యవధి గల బీఈఎస్ఎస్ ప్రాజెక్టులను కూడా సీఐఎల్ రూపొందిస్తోంది. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) ద్వారా సరఫరా సామర్థ్యం సమకూర్చు కోసం ఉదగా, ఈపీసీ టెండర్ కూడా జారీ అయింది. అయితే, విస్తృత లభ్యత సహా విశ్వసనీయ ఇంధన నిల్వ-నిర్వహణ, పర్యవేక్షణ మాత్రమే కాకుండా సరఫరా నిబంధనలకు అనుగుణంగా ఉండటం, ప్రగతి సాధనకు తగిన ఆధునిక ప్రణాళిక తదితరాలపై వాణిజ్యపరంగా బీఈఎస్ఎస్ ప్రాజెక్టుల వాణిజ్య విజయం ఆధారపడి ఉంటుంది.

బ్యాటరీలు, ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధన వ్యవస్థలు, ఎలక్ట్రానిక్స్, అత్యాధునిక తయారీ, ఏరోస్పేస్, రక్షణ రంగాలకు కీలక ఖనిజాలు అత్యావశ్యకం. 'సీఐఎల్'కు దేశీయంగా మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లోని గ్రాఫైట్ ఆస్తులు సహా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలోని అరుదైన భూ మూలకాలు (ఆర్ఈఈ), అరుదైన లోహాల లభ్యత అవకాశాలు మెండుగా ఉన్నాయి.

వనరుల నిర్ధారణ, జియోమెటలర్జీ, బెనిఫిషియేషన్, రికవరీ, ఉత్పత్తి స్పెసిఫికేషన్, వ్యర్థాల నిర్వహణ, మార్కెట్ సంధానం వంటివి ప్రధానంగా దృష్టి సారించాల్సిన రంగాలు. ఇండియన్ రేర్ ఎర్త్స్ లిమిటెడ్ (ఐఆర్ఈఎల్), నాన్-ఫెర్రస్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్ (ఎన్ఎఫ్‌టీడీసీ), కర్టిన్ యూనివర్సిటీ, హిందుస్థాన్ కాపర్, ప్రభుత్వ రంగ సంస్థల సహకారంతో ఈ కృషి వేగం పుంజుకుంటోంది. విదేశీ అవకాశాలను దశలవారీ సాంకేతిక, ఆర్థిక వివేచన ప్రాతిపదికన మూల్యాంకనం చేస్తారు.

మరోవైపు మైనింగ్, బెనిఫిషియేషన్, ప్యూరిఫికేషన్, స్ఫెరోనైజేషన్, కోటింగ్, యానోడ్ మెటీరియల్స్ ఉత్పాదన సహిత సమీకృత గ్రాఫైట్ విలువ వ్యవస్థ ఏర్పాటుపై సీఐఎల్ లక్ష్యనిర్దేశం చేసుకుంది. ఎన్ఎఫ్‌టీడీసీ సహకారంతో 99.95 శాతం కనీసం స్వచ్ఛత గల కోటెడ్ స్ఫెరికల్ ప్యూరిఫైడ్ గ్రాఫైట్ (సీఎస్‌పీజీ) ఉత్పాదనకు ఒక ప్రదర్శనాత్మక ప్లాంటును అర్హత వేదికగా ప్రతిపాదించారు. అటుపైన సుస్థిర నాణ్యతతో ఉత్పత్తి, ప్రక్రియ సామర్థ్యం, వినియోగదారు ధ్రువీకరణలకు అనుగుణంగా వాణిజ్య స్థాయి ఉత్పత్తిని పెంచుతారు.

మైనింగ్, ప్రాసెస్ పరిశ్రమలు, విద్యుత్తు, పునరుత్పాదక శక్తి, గ్రిడ్ సేవలు, అత్యాధునిక పదార్థ రంగాలకు ఒక ఉమ్మడి డిజిటల్ స్వరూపం అవసరం. సురక్షిత ఎంటర్‌ప్రైజ్ డేటా రూమ్, ప్రామాణిక ప్రాజెక్టు ఆర్థిక నమూనాలు, జీఐఎస్ ఆధారిత అవకాశాల గుర్తింపు, ప్రాజెక్టు దశ, ఆమోదాలు, పెట్టుబడి, షెడ్యూల్, నష్టాలు, రాబడులపై పర్యవేక్షణకు సంబంధిత డాష్‌బోర్డులు సహా టెండర్ దశ నుంచి డిజిటల్ ఇంజనీరింగ్, ఆస్తి-సమాచార నిబంధనలు కూడా ఇందులో కీలకాంశాలుగా ఉంటాయి.

అవకాశాల పరిశీలన, భావన ధ్రువీకరణ, సాధ్యాసాధ్యాలు, కాంట్రాక్టులు, ప్రదర్శన, వాణిజ్య కార్యకలాపాలను ఒక సాధారణ స్టేజ్-గేట్ నమూనా విశ్లేషిస్తుంది. సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, స్థానికీకరణ, అంచనా వేయదగిన ఫలితాలు, వ్యవధి నిర్దేశిత లక్ష్యాలపై దృష్టి సారిస్తూ, ప్రత్యేక సాంకేతికతలు, మార్కెట్లను అందిపుచ్చుకోవడంలో జాయింట్ వెంచర్లు, వ్యూహాత్మక భాగస్వామ్యాలను సీఐఎల్ సద్వినియోగం చేసుకుంటుంది.

ముప్పు నిర్వహణ ప్రక్రియ కోసం సీఐఎల్ ఒక చురుకైన, దశలవారీ విధానాన్ని అనుసరిస్తుంది. ఇందులో- సాంకేతిక-వనరుల పరమైన ముప్పులు, మార్కెట్-ఆర్థిక ముప్పులు, అమలు-వ్యయాల ముప్పులు, పర్యావరణ-సామాజిక-పాలన (ఈఎస్‌జీ) సహా సరఫరా-వ్యవస్థ ముప్పులు, సైబర్-కార్యాచరణ వ ం ం ఎ ్ ు ్ల ల ం , సామర్థ్యం-సంబంధిత ముప్పులు అంతర్భాగంగా ఉంటాయి.

ముప్పు ప్రతిస్పందనలలో ప్రయోగాత్మక ధ్రువీకరణ, స్వతంత్ర సమీక్ష, వినియోగదారు అర్హత ధ్రువీకరణ, కొనుగోలు ఏర్పాట్లు వంటివి ఉంటాయి. పటిష్ఠ వివరణాత్మక ప్రాజెక్టు నివేదికలు (డీపీఆర్), తాత్కాలిక ప్రణాళికలు, జీవితచక్రం అంచనా-స్థానికీకరణ, కార్యాచరణ సాంకేతిక భద్రత, సంఘటనలపై ప్రతిస్పందన, లక్షిత శిక్షణ-జ్ఞాన బదిలీ వంటివి కూడా ఉంటాయి.

కీలక పనితీరు సూచీలలో- ప్రాజెక్ట్ సామర్థ్యం, కార్యాచరణ లభ్యత-నాణ్యత, మెగావాట్లలో పునరుత్పాదక ఇంధన సామర్థ్యం, మెగావాట్ అవర్ పరంగా నిల్వ సామర్థ్యం, ఖనిజ వనరుల అభివృద్ధి, అంతిమ ఉత్పత్తుల అర్హత, దిగుమతి ప్రత్యామ్నాయం, స్వదేశీ సాంకేతికత, ముప్పు-సర్దుబాటు రాబడులు, నగదు రాబడులు, ఉద్గారాలు, నీరు, వ్యర్థాలు, పునరుద్ధరణ, భద్రత, సామాజిక ప్రభావ ఈఎస్‌జీ ఫలితాలు ఉంటాయి.

సాంకేతికత ఆధారిత వైవిధ్యీకరణ కోసం వ్యాపారాభివృద్ధి విభాగం ఎంటర్‌ప్రైజ్ ఇంటిగ్రేటర్‌గా పనిచేస్తుంది. అవకాశాల గుర్తింపు, భాగస్వామ్యాల ఏర్పాటు, సాంకేతికతల ధ్రువీకరణ, వాణిజ్య నమూనాల ఏర్పాటు, ఆమోద స్వీకణ ప్రాజెక్టుల క్రమబద్ధ అమలు వంటివి దీని బాధ్యతలలో భాగంగా ఉంటాయి. జవాబుదారీగా గల స్పాన్సర్లతో ఏకీకృత వైవిధ్యీకరణ-సాంకేతిక భవిష్య ప్రణాళికను రూపొందించడం, ప్రామాణిక సాంకేతిక, ఆర్థిక, ఈఎస్‌జీ మూల్యాంకన టెంప్లేట్లు, ముందుగా నిర్దేశించిన విజయ ప్రమాణాలు, స్వతంత్ర ధ్రువీకరణ సహిత ప్రదర్శన ప్రాజెక్టుల రూపకల్పన వంటివి తక్షణ ప్రాథమ్యాలలో ఉన్నాయి.

'సీఐఎల్'లో 1975లో ఏర్పాటైన 'సైన్స్ అండ్ టెక్నాలజీ స్టాండింగ్ కమిటీ' 1994లో ఏర్పాటైన పరిశోధన-అభివృద్ధి బోర్డు, 2003లో ఏర్పాటైన అపెక్స్ కమిటీ దాకా ఈ పరిశోధన-అభివృద్ధి చట్రం రూపొందింది. ఈ చట్రం ఇప్పుడు 2026 నాటి స్వతంత్ర పరిశోధన-అభివృద్ధి విధానం తోపాటు మార్గదర్శకాల దాకా పరిణామశీలమైంది. ఇవి టెక్నాలజీ రెడినెస్ లెవెల్ (టీఆర్ఎల్) 4, అంతకన్నా ఎక్కువ గల ప్రాజెక్టులకు ప్రాధాన్యమిస్తాయి.

గని ప్రణాళిక, ఉత్పాదకత, భద్రత, అన్వేషణ, కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ఆధారిత అత్యాధునిక మైనింగ్, పర్యావరణం-సుస్థిరత, వ్యర్థాల నుంచి అర్థం, టెక్నాలజీ ఆవిష్కరణ-స్వదేశీకరణ, బొగ్గు ప్రత్యామ్నాయ ఉపయోగాలు, పునరుత్పాదక ఇంధనం స్వచ్ఛమైన బొగ్గు, శుద్ధి-ఖనిజ శుద్ధి వగైరాలు ప్రధాన రంగాలలో భాగంగా ఉన్నాయి.

పరిశోధన-అభివృద్ధి వ్యవహారాల సీఐఎల్ బోర్డు, ఆర్ అండ్ డి బోర్డు, అపెక్స్ కమిటీ, అనుబంధ సంస్థల స్థాయి ఆర్ అండ్ డి కమిటీల ద్వారా ప్రాజెక్ట్ విలువను బట్టి ఆమోదాలు లభిస్తాయి. సీఐఎల్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్, ఐఐటీలు, ఎన్ఐటీలు, సీఎస్ఐఆర్ ప్రయోగశాలలు, పరిశోధన సంస్థలు, అనుబంధ సంస్థలు, ఇంక్యుబేషన్ కేంద్రాలు, అంకుర సంస్థలు, పారిశ్రామిక భాగస్వాములను అనుసంధానించే హబ్ అండ్ స్పోక్ నెట్‌వర్క్ మద్దతుతో, నాసర్ (ఎన్ఏసీసీఈఆర్) ఒక స్వతంత్ర నోడల్ సంస్థగా, కేంద్రక కూడలిగా పనిచేస్తుంది.

సీఐఎల్ నిధులతో నడిచే ప్రధాన అత్యున్నత నైపుణ్య కేంద్రాలలో ఐఐటీ-మద్రాస్‌లోని 'సీఐఎల్ సెంటర్ ఆఫ్ సస్టెనబుల్ ఎనర్జీ' ఒకటి. దీనికి -87.90 కోట్ల నిధుల లభ్యత ఉండటంతో ఇది సుస్థిర పదార్థాలు, గనుల పునరుపయోగం, ఇంధన మార్పిడిపై దృష్టి సారిస్తుంది. అలాగే, ఐఐటీ-హైదరాబాద్‌లోని 'క్లీన్జ్'కు ?98 కోట్ల నిధుల మద్దతు ఉండగా, ఇది స్వచ్ఛ బొగ్గు సాంకేతికత, తక్కువ-గ్రేడ్ భారతీయ బొగ్గుపై దృష్టి సారిస్తుంది, ఐఐటీ-(ఐఎస్ఎం) ధన్‌బాద్‌లోని సీఐఎల్ సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ ఇన్ మైనింగ్, ?67.45 కోట్ల నిధులతో మైనింగ్ 4.0, ఐఓటి, స్మార్ట్ మైన్స్, ఇమ్మర్సివ్ టెక్నాలజీస్, 5జిలపై దృష్టి సారిస్తుంది. ఐఐటీ-(ఐఎస్ఎం) ధన్‌బాద్‌లోని సీఐఐ సెంటర్ ?10 కోట్లలతో ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్, ప్రోటోటైపింగ్, వర్చువల్ రియాలిటీ, సిమ్యులేషన్ సహా ఆటోమేషన్‌పైనా దృష్టి సారిస్తుంది.

పరిశోధన-అభివృద్ధి రంగంలో -231 కోట్ల ఆమోదిత వ్యయంతో 20 వేర్వేరు ప్రాజెక్టులు ఉన్నాయి. అధిక ప్రభావం చూపే ఈ కార్యక్రమాలలో కాస్టా వెస్ట్‌లో యూసీజీ, ఓపెన్‌కాస్ట్-అండర్‌గ్రౌండ్ గనుల కోసం 5జి స్వతంత్ర నెట్‌వర్కులు, బైఫేషియల్ పెరోవ్‌స్కైట్ సోలార్ సెల్స్, కీలక ఖనిజాల కోసం కృత్రిమ మేధ, జియోఫిజికల్ అన్వేషణ వంటివి ఉన్నాయి.

ఇక 2023-24 ఆర్థిక సంవత్సరంలో పరిశోధన-అభివృద్ధి వ్యయం 61.31 కోట్లుకాగా, 2024-25లో ?245.38 కోట్లు, 2025-26లో -183.88 కోట్లు. 2026-27లో -225 కోట్లు, 2027-28లో -350 కోట్లు, 2028-29కిగాను -400 కోట్లు, 2029-30కి -500 కోట్ల వంతున ప్రణాళికబద్ధ వ్యయం చేస్తారు.

ఈ నేపథ్యంలో 2026-27లో ఐదు పేటెంట్ల దాఖలు, మరో రెండు పేటెంట్ల ప్రక్రియ కొనసాగుతుండటం సంస్థ సాధించిన విజయాలలో కొన్ని, బైఫేషియల్ పెరోవ్‌స్కైట్ సోలార్ సెల్స్‌కు ఒక పేటెంట్ మంజూరు కాగా, వెలాసిటీ ఆఫ్ డిటోనేషన్ కొలత పరికరాల వాణిజ్యీకరణ కోసం సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, ట్రిపుల్ ఐటీ, రూర్కీ, ఐఐటీ-ఖరగ్‌పూర్‌తో కలిసి కొత్త సీఐఎల్ అత్యున్నత నైపుణ్య కేంద్రాల స్థాపనకు చర్చలు వంటివి ఉన్నాయి.

ఈ నేపథ్యంలో మరింత ముందంజ వేయడం కోసం 'నాసర్' (ఎన్ఏసీసీఈఆర్)ను బలోపేతం చేయడం అవశ్యం. హబ్ అండ్ స్పోక్ వ్యవస్థ విస్తరణ, పరిశోధన నుంచి ఆచరణ దాకా ప్రక్రియలను వేగిరపరచడం, గ్యాసిఫికేషన్, భవిష్యత్ పదార్థాలు, బ్యాటరీల వంటి స్వదేశీ-భవిష్యత్ సంసిద్ధ సాంకేతికతలపై దృష్టి సారించడం కూడా అవసరం.

సంప్రదాయ బొగ్గు తవ్వకం సంస్థ స్థాయి నుంచి క్రమంగా వైవిధ్యభరిత ఇంధనం, ఖనిజాలు, మెటీరియల్స్, టెక్నాలజీ ఆధారిత సంస్థగా సీఐఎల్ పరిణామం చెందుతోంది. బొగ్గు గ్యాసిఫికేషన్, పొదుపైన విద్యుదుత్పాదన, పునరుత్పాదక ఇంధనం, బీఈఎస్ఎస్, కీలక ఖనిజాలు, అత్యాధునిక పదార్థాలు, పరిశోధన-అభివృద్ధి తదితర రంగాల్లో ఈ సంస్థ కార్యక్రమాలు ప్రస్తుత రూపాంతరీకరణకు విస్తృత పునాది వేస్తున్నాయి.

అటుపైన భవిష్యత్తులో సాంకేతిక ధ్రువీకరణ, స్వదేశీ సామర్థ్యం, వ్యూహాత్మక భాగస్వామ్యాలు, క్రమబద్ధ పెట్టుబడులు, డిజిటల్ పాలన, పటిష్ఠ ముప్పు నిర్వహణ తదితరాల ద్వారా ఈ కార్యక్రమాల విస్తరణతోపాటు వాణిజ్యపరంగా నిలకడైన ఫలితాలు రాబట్టడంపై దృష్టి సారిస్తారు. నాసర్ సహా ఆర్ అండ్ డి, హబ్ అండ్ స్పోక్ వ్యవస్థల బలోపేతంతోపాటు పరిశోధన-ఆవిష్కరణల క్షేత్రసాయి అమలు మరింత వేగం పుంజుకుంటాయి.

విస్పష్ట దశలు, అంచనా వేయగల ఫలితాలు, జవాబుదారీతనంతో కూడిన అమలు ద్వారా సీఐఎల్ తన మైనింగ్ నైపుణ్యం, సంస్థాగత సామర్థ్యాలు, సాంకేతిక వ్యవస్థల సద్వినియోగంతో దేశ ఇంధన-ఖనిజ భద్రతకు తోడ్పడుతుంది.

# క్యాన్సర్ గురించి అవగాహన అవసరం


## సెప్టెంబర్ 22..క్యాన్సర్ రోగుల సంక్షేమ దినం.

కాన్సర్ గురించి అవగాహన పెంపొందించడానికి, దాని నివారణ, గుర్తింపును, చికిత్సను ప్రోత్సహించేందుకు సెప్టెంబర్ 22 న ప్రపంచ క్యాన్సర్ రోగుల సంక్షేమ దినంగా జరుపుకుంటారు.

'ఇంటర్నేషనల్ యూనియన్ ఎగెనెస్ట్ క్యాన్సర్ సంస్థ ప్రజలలోకి క్యాన్సర్ అవగాహనను తీసుకెళ్లేందుకు కృషి ప్రారంభించింది. ఆ సంస్థలో మొత్తం 100 దేశాలు, క్యాన్సర్ వ్యాధి మీద యుద్ధం చేస్తున్న 350 సంస్థలు సభ్యత్వం కలిగి ఉన్నాయి. వీరందరూ మీడియా ద్వారా క్యాన్సర్ వ్యాధి ప్రమాదాన్ని ప్రచారం చేయాలని పాలనా విధానాలలో క్యాన్సర్ వ్యతిరేక చర్యలు చేపట్టేల ప్రభుత్వాల మీద ఒత్తిడి తేవటం కూడా వారు చేస్తున్న పని.

అసలు క్యాన్సర్ అంటే ఏమిటి సాధారణంగా మన శరీరంలో కణ విభజనలు ఒక క్రమ పద్ధతిలో నియంత్రించ బడతాయి. కొన్ని సందర్భాలలో కణాల పెరుగుదలలో నియంత్రణ లేనందువల్ల కణాలు చాలా వేగంగా అస్తవ్యస్తంగా విభజన చెంది కణ సమూహాలను ఏర్పరుస్తాయి. ఈ కణ సమూహాలను 'కంతి' ( టూమర్, బిబీఎనీతీ) అంటారు. అటువంటి కొన్ని ప్రమాదకరమైన వాటిని కేన్సర్ అని వ్యవహరిస్తారు. ఈ రకమైన పెరుగుదలకు ఒక స్పష్టమైన విధి ఉండదు. కేన్సర్ గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'ఆంకాలజీ' (ొనిఇనీశ్రీనీణఎ) అంటారు. క్యాన్సర్ ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన వ్యాధి. క్యాన్సర్ మహమ్మారి ఏటా రూ.41, 17,000 కోట్లు హరిస్తూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మూడింట రెండొంతుల క్యాన్సర్ మరణాలు పేద, మధ్యతరగతి దేశాల్లోనే సంభవిస్తున్నాయి. అందులో ఎక్కువ భాగం ముందుగా గుర్తించి చికిత్స అందించడం ద్వారా నయంచేయొచ్చని డబ్ల్యూహెచ్ఒ(చిఊబా) వెల్లడించింది. క్యాన్సర్ అనేది ఏ వయస్సు వారి కైనా రావచ్చును. ఆడవారికి మగవారికి కూడ రావచ్చును. శరీరములో నోరు, గొంతు, ఎముకలు, రొమ్ము, చర్మము మున్నగు ఏ భాగానికి అయినా రావచ్చును.

శరీరంలో ఏదైనా అవయవానికి కేన్సర్ సోకితే తొలిదశలో లక్షణాలు అంతగా కనిపించవు. వ్యాధి సోకిన అవయవాన్ని బట్టి దీని నిర్ధరణ పరీక్షలు కూడా వేర్వేరుగా ఉంటాయి. కొన్ని రకాల క్యాన్సర్లనూ ఒకే విధమైన పరీక్షతో తెలుసు కోవడం సాధ్యం కాదు. క్యాన్సర్ అంటువ్యాధి కాదు. అలాగే వంశపారం పర్యంగా వచ్చే అవకాశం కూడా తక్కువే. అయితే, రొమ్ము, థైరాయిడ్, పెద్దపేగు, పాంక్రియాస్ క్యాన్సర్లు జన్య పరంగా సంక్రమిస్తాయి. కుటుంబంలో ఎవరికైనా ఈ క్యాన్సర్లు వస్తే వచ్చే ప్రమాదం ఉంది. క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తించక పోతే ఇతర భాగాలకూ వ్యాపించి, చికిత్సకు సైతం ఏమాత్రం తగ్గుముఖం పట్టవు. కాబట్టి దీనిపై అవగాహనతో ఎదుర్కొవాలి. కేన్సర్‌కు కారణాల్లో ఆధునిక జీవన శైలి ప్రధానమైంది. మద్యం, పొగతాగడం, ఆహార పదార్థాల్లో రంగులు వినియోగం, రసాయనాలు వాడటం, హార్మోన్లు అధికంగా వాడటం, అధిక బరువు, కాలుష్యం, క్రిమిసంహారకాలు, చికిత్సలో భాగంగా లేదా ప్రమాద వశాత్తు రేడియేషన్‌కు గురికావడం, తరచూ వేధించే ఇన్ఫెక్షన్లు.. ఇవన్నీ క్యాన్సర్‌కు కారకాలు. కొన్ని రకాల కేన్సర్లను రాకుండా వ్యాక్సిన్ వేసుకోవచ్చు. వాటిలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు ప్రధాన కారణం హెచ్‌పీవీ వైరస్. కాబట్టి దీనికి వ్యాక్సిన్ వేసుకుని నివారించ వచ్చు. 9 ఏళ్ళ పైబడిన బాలికల నుంచి 40 ఏళ్ల మహిళల వరకు




ఈ వ్యాక్సిన్ వేయించు కోవచ్చు. అలాగే అండాశయం, గొంతు క్యాన్సర్ రాకుండా కూడా ఇది అడ్డుకుంటుంది.

క్యాన్సర్ కణం ఒక్కొక్కరిలో ఒక్కోలా ఉంటుంది. కేన్సర్‌ను తొలి దశలోనే గుర్తించడం, దానికి ఇతర అవయవాలకు విస్తరించే గుణం ఉందా అనే అంశాలపై ఆధారపడి ఉంటుంది. సర్జరీ, మందులు, థెరపీలు కూడా దీనిపైనే ఆధారపడి ఉంటాయి. క్యాన్సర్‌ను జయించడం, త్వరగా గుర్తించడంతో పాటు ఆ కణితులు పరిమాణం, దశ, గ్రేడింగ్ కూడా చాలా ముఖ్యం. కాన్సర్‌కు వయసుతో సంబంధం లేదు. అన్ని వయసుల వారూ దీని బారిన పడే అవకాశాలు మెండుగా ఉంటాయి. కానీ చిన్నపిల్లల్లో వచ్చే క్యాన్సర్లను చాలా వరకు పూర్తిగా నయం చేయ గలిగినవే. అయితే, వయస్సు పెరిగేకొద్ది కేన్సర్స్ వచ్చే ముప్పు ఎక్కువ. ఈ సమయంలో వచ్చే కేన్సర్ల తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుంది.

అందుకే కేన్సర్ చికిత్సను కూడా వయస్సును బట్టి నిర్ధరిస్తారు. క్యాన్సర్ కణాలను నిర్వీర్యం చేయడానికి కీమోథెరఫీ, రేడియో థెరఫీలతో పాటు ల్యాప్రోస్కోపిక్ పద్ధతిలో చేసే కీహోల్ సర్జరీలు కూడా నేడు అందుబాటులో ఉన్నాయి. సర్జరీ తర్వాత రేడియో, కీమో, హార్మోన్ థెరఫీ లాంటివి చేసినా, లేక థెరఫీల తర్వాత సర్జరీ చేసినా చికిత్స అంతటితో అయి పోయిందని భావించరాదు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించు కోవాలి.

క్యాన్సర్ కణం శరీరంలో ఎక్కడుందనే విషయం తెలుసు కోవడం కష్టం. ఏ అవయవానికి సోకిందనే అనుమానం ఉంటే దానికి సంబంధించిన పరీక్షలు వేర్వేరుగా ఉంటాయి. వీటిలో బయాప్సీ, యఫ్‌యన్ఏ టెస్ట్, బ్లడ్ మార్కర్స్, ఎక్స్-రే, సీటీ స్కాన్, యంఆర్ఐ, పీఈటీ స్కాన్ వంటివి అవసరాన్ని బట్టి చేస్తారు. అయితే సర్వైకల్ క్యాన్సర్‌ను పాప్‌స్మియర్ ద్వారా ముందుగా గుర్తించవచ్చు.

ప్రభుత్వాలు చర్యలలో భాగంగా పొగాకు వాడకంపై యుద్ధం ప్రకటించడం, సిగరెట్ తయారీ కంపెనీలు వ్యాపార ప్రకటనలు ఇవ్వటాన్ని నిషేధించాయి. అదే విధంగా బీడీ కట్టల మీద పుర్రె గుర్తు ముద్రణతో క్యాన్సర్ భయాన్ని ప్రజలలోకి తీసుకువెళ్ళ గలిగారు. మత్తు పానీయ ప్రకటనల మీద నిషేధం తీసుకు వచ్చారు. మన దేశంలో నోటి క్యాన్సర్ కేసులు అధికంగా నమోదవటానికి కారణం గుట్కా వాడకమే. భారత దేశంలో 80 శాతం మందికి క్యాన్సర్ ముందుగా గుర్తు పట్టలేక పోతున్నారు. క్యాన్సర్ పై అవగాహన పెరగాలి. లేటు వయస్సు వారికి ఎక్కువగా క్యాన్సర్ వస్తున్నది. నేడు లైఫ్ స్టైల్ మారింది. పొగాకు సంబంధిత వస్తువులు వాడటం వల్ల 40శాతం మందికి క్యాన్సర్ వస్తున్నదని తెలుస్తున్నది.

చికిత్సకు సంబంధించి నిర్ణయాలు మూడు విషయాలపై ఆధారపడి వుంటాయి. శరీర సాధారణ స్థితి, ఇతర జబ్బులు, కాన్సరు దశ, రోగి కోరిక, సమ్మతి. తొలిదశలో వున్న కాన్సర్లలో 70 నుంచి 90 శాతం కేసుల్లో నయం అయ్యే అవకాశం వుంది. కాన్సరు చికిత్సలో 19వ శతాబ్దం చివరిదశలో కాన్సరుకు శస్త్ర చికిత్స ప్రారంభమైంది. అయితే కాన్సరుకు శస్త్ర చికిత్స రానురాను వయస్సు పెరిగిన కొద్దీ తగ్గిపోతున్నది. రేడియేషన్ చికిత్స ఎక్స్రేను కనుగొన్న 1895 నుండి జరుప బడుతున్నది. వృద్ధుల్లో కాన్సరు జబ్బుకు రేడియేషన్ చికిత్సను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. కాన్సరుకు మందులతో చికిత్స 1950 నుండి ప్రారంభమైంది. వృద్ధుల్లో కాన్సరు చికిత్సకు మందులను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.

క్యాన్సర్ కష్ట నష్టాల గురించి ప్రజలకు తెలియజేసి అవగాహన కల్పిచాలి , కాన్సర్ వ్యాధిని నయం చేయడానికి శస్త్ర చకిత్స, రేడియేషన్, కీమోథెరపీ అవసరం. ఆరోగ్యపు అలవాట్లను, ఆహారపు అలవాట్లను 30 నుంచి 40 ఏళ్ల వయస్సు నుంచే ప్రారంభించాలి. తొలిదశలోనే కాన్సరును గుర్తించి చికిత్స పొందాలి. ధూమపానం, సురాపానం, గుల్కా, జర్దాకిల్లీలు మానాలి. పండ్లు, కూరగాయలు పీచు పదార్థం ఎక్కువగానూ, కొవ్వు తక్కువగానూ వుండే ఆహారాన్ని తీసుకోవాలి. కాన్సరు బారినుండి శరీరాన్ని రక్షించు కోవాలి. దీనికి స్క్రీనింగ్ పరీక్షలు జరపాలి.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలి

## తెలంగాణ పద్మశాలి సంఘం ప్రాంత ఉపాధ్యక్షుడు బేత రమేష్ డిమాండ్



ఆదిలాబాద్, సెప్టెంబర్ 21:ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు అవుతున్న జాయింట్ యూజర్ ఎయిర్‌పోర్టుకు స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ తొలి ఉద్యమ పోరాటయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని తెలంగాణ పద్మశాలి సంఘం ప్రాంత ఉపాధ్యక్షుడు బేత రమేష్ డిమాండ్ చేశారు. కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం జిల్లా కేంద్రంలోని బాపూజీ చౌక్‌లో ఆయన విగ్రహానికి పద్మశాలి సంఘం నాయకులు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా బేత రమేష్ మాట్లాడుతూ ఆదిలాబాద్‌లో నూతనంగా ఏర్పాటు కానున్న జాయింట్ యూజర్ ఎయిర్‌పోర్టుకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని కోరారు. మూడు తరాల ఉద్యమంలో, తెలంగాణ రాష్ట్ర సాధనలో బాపూజీ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 27న బాపూజీ జయంతిని పురస్కరించుకుని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అధికారిక సెలవుదినంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు.

కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు జక్కుల సత్యనారాయణ, ఎం. ఆశమ్మ, అనుముల ఉషన్న, కుర్ర రవీందర్, అడెల్లు, బాసదత్తు, బొమ్మకంటి రమేష్, మోర ఆశన్న, విలాస్, మామిడాల దశరథ్, శ్రీనివాస్, దాసరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సూర్యప్రభ వాహనంపై మలయప్పస్వామి దర్శనం



తిరుపతి, సెప్టెంబర్ 21:తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజు సోమవారం ఉదయం శ్రీ మలయప్పస్వామి సూర్యప్రభ వాహనంపై తిరుమాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. వాహనం ముందు భక్తబృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తించగా, మంగళవాయిద్యాల నడుమ వాహనసేవ వైభవంగా సాగింది.

భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పిస్తూ స్వామివారిని దర్శించుకున్నారు. సూర్యుడు సకల జీవులకు ఆరోగ్యాన్ని, చైతన్యాన్ని ప్రసాదించే దివ్యశక్తికి ప్రతీక అని అర్చకులు తెలిపారు. సోమవారం రాత్రి శ్రీ మలయప్పస్వామివారు చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిస్తారని వివరించారు . వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి. హెచ్. వెంకయ్య చౌదరి, సీవీఎస్వో కె.వి. మురళీకృష్ణ, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

# నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పై ఏసీబీ దాడులు..

## రూ.15 వేలు లంచం తీసుకుంటూ ఇద్దరు పట్టివేత

నిజామాబాద్, సెప్టెంబర్ 21: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంపై అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఓ వ్యక్తి తన పనుల కోసం అనుమతి కోరగా సదరు విభాగంలోని అధికారి లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించినట్లు వారు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలోని రెండో అంతస్తులు గల ఎస్టాబ్లిష్మెంట్ విభాగంలో విధులు నిర్వహించే జూనియర్ అసిస్టెంట్ అశోక్ కుమార్ రూ.15 వేలు బాధితుడి వద్ద నుండి లంచం తీసుకోవడంతో నిజామాబాద్ ఇన్‌చార్జి ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ ఆధ్వర్యంలో దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

అతనితోపాటు అదే విభాగంలో ఔట్సోర్సింగ్ ఎంప్లాయ్ గా పనిచేస్తున్న కిరణ్ కుమార్‌ను సైతం ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

# నా పాలనలో ఏ డీఎస్సీలోనూ అవకతవకలు జరగలేదు - సీఎం చంద్రబాబు

చిత్తూరు, సెప్టెంబర్ 21: డీఎస్సీ స్పోర్ట్స్ కోటా టీచర్లపై వైసీపీ దాడులపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై కుప్పం బహిరంగ సభలో స్పందిస్తూ.. టీచర్లపై వైసీపీ నేతల దాడిని తప్పుపట్టారు. డీఎస్సీ ఉద్యోగాలు తమ కష్టార్జితమని టీచర్లంతా నినదిస్తున్నారని.. ఫేక్ పార్టీ అందరినీ ఫేక్ అంటే సహించేది లేదని విజయవాడలో స్పోర్ట్స్ టీచర్లు ఆందోళన చేస్తున్నారని తెలిపారు. ఇవాళ విజయవాడలో గురువులపై రౌడీలు దాడి చేస్తున్నారని మండిపడ్డారు. టీచర్లపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకోమని... చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 'సీబీఎన్ జారీ చేసిన డీఎస్సీ నోటిఫికేషన్లలో అవినీతే జరగలేదు.. నా హయాంలో ఎప్పుడూ పేపర్ లీక్ కాలేదు. సీబీఎన్ పాలనలో టీచర్ల రిక్రూట్మెంట్, డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తాం... ఇదీ మన ట్రాక్ రికార్డ్' అని వెల్లడించారు.

నియామకాలు జరిగిన ఏడాది తర్వాత ఇప్పుడు లేనిపోని దుష్ప్రచారం చేస్తూ బురద జల్లుతున్నారని సీఎం మండిపడ్డారు. కర్నూలు కొండారెడ్డి బురుజు, విజయవాడలో అంబేద్కర్ విగ్రహం, విశాఖలో సముద్రం ఒడ్డున దుష్ప్రచారాన్ని తిప్పడికొడుతూ టీచర్లు గర్జించారన్నారు. ఫేక్ పేపర్‌కు చెందిన రిపోర్టర్ ఓ ఉపాధ్యాయుడిపై దాడి చేశారంటే... వైసీపీ మూకలు ఎంతకు బరితెగించాయో అర్థం చేసుకోవాలని అన్నారు. ఇలాంటి వాళ్లను ఇంకా ఉపేక్షించాలా..? వీరిలాగే కొనసాగితే ఆస్తులకు ఆడబిడ్డలకు రక్షణ ఉంటుందా అని ప్రశ్నించారు. అసెంబ్లీకి వచ్చి చర్చిస్తే సాక్ష్యాధారాలతో చూపించి వారి నోళ్లు మూయిస్తామని తెలిపారు. చట్టబద్ధంగా జరిగిన ప్రక్రియపై అవసరమైతే కోర్టులకు వెళ్లొచ్చని... కానీ దాడులేంటీ...? ఉపాధ్యాయులపై రౌడీలను ఎగదొయడమేంటీ అంటూ ఫైర్ అయ్యారు.

2019-24 మధ్య రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని... రాష్ట్రానికి అది మామూలు నష్టం కాదని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. నాటి పాలనలో పాలకులే రౌడీయిజం చేశారని.. దారుణాలకు పాల్పడ్డారని వ్యాఖ్యానించారు. కుప్పం వస్తే తనను కూడా ఇబ్బందులు పెట్టారని.. దౌర్జన్యాలకు దిగారని మండిపడ్డారు. ఓడిపోయిన తర్వాత కూడా చంపడానికైనా చావడానికైనా సిద్ధమంటూ రౌడీయిజం చేస్తున్నారని అన్నారు. రౌడియిజం చేసే వారి తోక కత్తిరిస్తామని... రౌడీలను విధ్వంసకారులను తరిమి కొట్టే సత్తా కుప్పానికి ఉందని హెచ్చరించారు. ఫ్లెక్సీలకు పొట్టేళ్లు బలి ఇచ్చి రక్తాభిషేకం చేస్తున్న వారిని సైకోలు అనాలా..? మానసిక రోగులు అనాలా..? అంటూ వ్యాఖ్యానించారు. తిరుమల పవిత్ర లడ్డూను కూడా కల్తీ చేశారని మండిపడ్డారు. ప్రతి ఎన్నికలోనూ సైకిల్ గుర్తుకు మాత్రమే ఓటేసి మద్దతిచ్చిన నియోజకవర్గాలు ఒకటి కుప్పం, రెండోది హిందుపూర్ అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# విద్యార్థిని చదువుకు 'బ్రెయిలీ' తోడ్పాటు



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 21:(నేటినిజం ప్రతి నిధి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న జి. పల్లవికి ఆల్మికో ద్వారా అందిన బ్రెయిలీ కిట్, బ్రెయిలీ స్లేట్‌ను సోమవారం పంపిణీ చేశారు.

ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శేఖర్, లెక్చరర్ అంజయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ఉపాధ్యాయురాలు జయలక్ష్మి విద్యార్థినికి కిట్ అందజేశారు.

ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం

## ర్యాలమడుగులో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి



సంగారెడ్డి, సెప్టెంబర్ 21(నేటినిజం ప్రతినిధి) నిజాంపేట్ మండల పరిధిలోని ర్యాలమడుగు గ్రామానికి చెందిన దొంతిగారి సుజాత-మల్లేష్ దంపతులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొని నూతన గృహాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్‌కుమార్ శేట్కర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ.. పేదల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. సొంత ఇల్లు లభించడంతో సుజాత?మల్లేష్ దంపతుల కుటుంబంలో ఆనందం వెల్లివిరిసిందని, వారి నూతన జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు గౌరవప్రదమైన నివాసాన్ని కల్పించడ ంతో పాటు, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరి చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు, నిర్మాణం, బిల్లుల చెల్లింపు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగారెడ్డి, నారాయణఖేడ్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పండరి రెడ్డి, ర్యాలమడుగు గ్రామ సర్పంచ్ సాయిలు, రాధాకిషన్ శేట్, కౌన్సిలర్ సుబుర్, ఉప సర్పంచ్ నాగయ్య, మల్లే ష్, సాయిలు, వెంకటరములు, కిష్టయ్య, లక్ష్మయ్య, నాగయ్యతో పాటు గ్రామ పెద్దలు, ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం ప్రజావాణికి క్యూ కట్టిన బాధితులు!

హైదరాబాద్, సెప్టెంబర్ 21: వీసాల పేరిట విదేశాలకు పంపుతామని నమ్మించి భారీ మోసాలకు పాల్పడిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. యూకేలో స్థిరపడిన యూట్యూబర్ నందన, ఆమె భర్త మధుకర్ తమను దారుణంగా మోసం చేశారంటూ బాధితులు నేరుగా తెలంగాణ సీఎం ప్రజావాణిని ఆశ్రయించారు. బేగంపేటలోని ప్రజాభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో బాధితులు తమ గోడును అధికారుల ముందు వెళ్లబోసుకున్నారు.

యూకే ప్రభుత్వం తమ కన్సల్టెన్సీ సంస్థకు ఉద్యోగులను నియమించుకునే అధికారిక అనుమతి ఉందని ఆ యూట్యూబర్ దంపతులు నమ్మబలికారు. స్టూడెంట్, విజిటర్ వీసాలపై యూకేకు వెళ్లిన వారికి అక్కడే వర్క్ వీసాలు ఇప్పిస్తామంటూ మాయమాటలు చెప్పారు. ఈ నమ్మకంతోనే ఒక్కొక్కరి వద్ద నుంచి ఏకంగా రూ.25 లక్షల నుంచి రూ.95 లక్షల వరకు భారీ మొత్తంలో వసూలు చేశారు.అయితే, ఆ కన్సల్టెన్సీ సమర్పించిన డాక్యుమెంట్లు అన్నీ నకిలీవని తేలడంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తెలంగాణలోని వికారాబాద్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన పలువురు నిరుద్యోగులు ఈ మోసానికి బలైనట్లు వారు వాపోయారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar,
Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.